RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 69 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 10-3-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥సప్తమి రా॥ 12.19, అనూరాధ సా ॥5.55, వర్జ్యం రా॥12.07 -1.54, దుర్ముహూర్తం ఉ॥8.41-9.28, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 6.17, సూర్యాస్తమయం సా॥ 6.04 గం॥

## వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ.31,34,807

-లోక్‌సభలో కేంద్రమంత్రి వెల్లడి 2లో

## శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకోం!

**-లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు**

**-గతంలో జరిగిన పొరపాట్లు లేకుండా పట్టాదార్ పాస్ పుస్తకాలు**

**-నంద్యాల జిల్లా పర్యటనలో సిఎం చంద్రబాబు నాయుడు**



**నంద్యాల,మార్చి9(ఆర్ఎన్ఎ):** శ్రీవారికి అపచారం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, మతవిద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు హెచ్చరించారు. లడ్డూ కల్తీపై ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సోమవారం డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజు గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటించారు. రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు ఉండటం ఏంటి అని ప్రశ్నించారు. ఇదేంటని అడిగితే బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. రికార్డులు తారుమారు చేయకుండా పకడ్బంధీగా పాస్‌పుస్తకాలు ఇస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎవరు తప్పు చేసినా వెంటనే తెలుస్తుందన్నారు. ఒక్కపైసా కూడా అవినీతి లేకుండా పట్టా ఇప్పించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. సమస్యలన్నీ పరిష్కరించాకే కొత్త పాక్ బుక్స్ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎక్కడా తప్పులు జరగకుండా చూస్తామని సీఎం అన్నారు. గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందని సీఎం విమర్శించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేశారని సీఎం ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. సీబీఐ రిపోర్ట్ ఇచ్చినా లడ్డూ కల్తీపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమలపై దృష్టి పెట్టానని సీఎం తెలిపారు. కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయేలా చేశారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవాతో తాగునీరు, కుప్పానికి కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. మాజీ మంత్రి వివేకాను దారుణంగా చంపారని.. నాన్న లేరు చిన్నాన్న కూడా లేరంటూ డ్రామాలు ఆడారని సీఎం విమర్శించారు. నారాసుర రక్తచరిత్ర అంటూ తన చేతిలో కత్తి పెట్టారని ఆరోపించారు. జగన్ మాటలు నమ్మి 2019లో తనకు ఓటు వేయలేదని చెప్పారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. డబ్బు మీద ఆశతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మందిని కనాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. పెద్ద కుటుంబానికి ఎక్కువ సహాయం చేసేలా పథకాలు తీసుకొస్తామన్నారు. రైతే రాజు కావాలని.. రైతు అప్పులపాలు కావడానికి వీల్లేదన్నారు. దీపం పథకం ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. గత పాలనకు ఈ పాలనకు తేడా ఏంటో ప్రజలే గమనించాలన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్కొన్నారు. కాగా.. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పంటల ఉత్పత్తుల స్టాళ్లను మిగతా 2లో..

## సిలిండర్ బుకింగ్‌లో కీలక మార్పులు

**-రెండో సిలిండర్ బుకింగ్ గడువు 25 రోజులకు పెంపు**



**న్యూఢిల్లీ,మార్చి 9(ఆర్ఎన్ఎ):** దేశీయ గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌కు సంబంధించి నిబంధనల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక సిలెండర్ డెలివరీ తర్వాత మరొక సిలిండర్ బుక్ చేయడడానికి కనీస గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు కేంద్రం పెంచినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సిలిండర్లు నిల్వచేసుకోవడం, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించేందుకు కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వలన కలిగే ఇంధన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకు కేంద్రం తాజా చర్యలు చేపట్టింది. చమురు రిఫైనరీలకు ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని, వాణిజ్య అవరసరాల కంటే గృహ అవసరాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఇంతకుముందు 55 రోజులకు సిలిండర్లు బుకింగ్ చేసుకునే వారు ఇప్పుడు 15 రోజుల్లోనే సిలెండర్లు బుక్ చేసుకుంటున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం సైతం ఎల్పీజీ భాగస్వాముల కోసం ప్రయత్నాలు చేస్తోందని, అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే దేశాలు ఇండియాకు ఎల్పీజీ అమ్మేందుకు సంప్రదింపులు సాగిసున్నాయని ఆ వర్గాలు చెప్పాయి. క్రూడాయిల్ బ్యారెల్ ధర 130 డాలర్లు దాటనంత వరకూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత్ వద్ద తగినన్ని ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 100 డాలర్లు దాటకపోవచ్చని అంచనా వేస్తున్నామని, దేశంలోని ఏ ఒక్క పెట్రోల్ బంక్‌లోనూ పెట్రోల్, డీజిల్ కొరత ఉండదని ఆ వర్గాలు చెప్పాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ నిల్వలు కూడా తగినంత ఉన్నాయని, ఏటీఎఫ్ ఉత్పత్తి, ఎగుమతిదారుగా ఇండియా ఉన్నందున ఏటీఎఫ్ గురించి ఆందోళన అవసరం లేదని కూడా తెలిపాయి.

## శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి నెయ్యి కొరత లేదు

**- అసత్య ప్రచారాలను నమ్మవద్దు**

**-భక్తులకు టిటిడి విజ్ఞప్తి**



**తిరుమల, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి నిల్వలు టిటిడి వద్ద సమృద్ధిగా ఉన్నాయని టిటిడి స్పష్టం చేసింది. ఇటీవల కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో టిటిడి వద్ద నెయ్యి నిల్వలు లేవని, లడ్డూ ప్రసాదాల తయారీలో అంతరాయం ఏర్పడుతోందని అసత్య ప్రచారం చేయడం సరికాదని తెలియజేస్తున్నాం. శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి సరఫరా మూడంచెల కొనుగోలు విధానం ద్వారా జరుగుతోంది. ఒకే సంస్థపై ఆధారపడకుండా మూడు వేర్వేరు సంస్థల ద్వారా నెయ్యి సరఫరా జరుగుతున్నందున ఎలాంటి అనుకోని పరిస్థితులు తలెత్తినా సరఫరాలో అంతరాయం కలగకుండా టిటిడి ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇందాపూర్ డైరీ నుండి తిరుమలకు వస్తున్న నెయ్యి ట్యాంకర్ ఇటీవల కడప జిల్లా కొండాపూర్ సమీపంలో ప్రమాదానికి గురైన విషయం నిజమే. అయితే ఒక సంస్థకు చెందిన ట్యాంకర్ ప్రమాదానికి గురైనంత మాత్రాన నెయ్యి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగలేదని టిటిడి స్పష్టం చేసింది. మిగిలిన రెండు సంస్థల నుండి నెయ్యి సరఫరా యథావిధిగా కొనసాగుతోంది. ప్రస్తుతం మిగతా 2లో..

## వివేకా హత్య కేసులో విచారణ

**-సిబిఐ ఫైల్స్ ఇండెక్స్ కోరిన నిందితులు**

**కడప,మార్చి9(ఆర్ఎన్ఎ):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై సీబీఐ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. నిందితులు సీబీఐకోసం కాకుండా, ముందుగా సిట్ దర్యాప్తు చేసిన వివరాలను అందజేయాలని న్యాయస్థానం లో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ ఇచ్చిన 13 లక్షల ఫైల్స్‌ను ఇండెక్స్ రూపంలో పొందుపరిచి ఇవ్వాలని నిందితులు కోర్టును కోరారు.

సీబీఐ అందజేసిన 13 లక్షల డిజిటల్ ఫైల్స్‌లో కొన్ని ఓపెన్ అవ్వలేదని కోర్టుకు నిందితుల న్యాయ వాదులు తెలిపారు. అందువల్ల సీబీఐ ఇచ్చిన ఫైల్స్‌ను ఇండెక్స్ రూపంలో పొందుపరిచి అందించాలని కోరారు. నిందితుల న్యాయ వాదుల అభ్యర్థనలను న్యాయస్థానం పరిశీలించింది. ఓపెన్ కాని ఫైల్స్‌ను మంగళవారం కోర్టు సమక్షంలో ఓపెన్ చేయడానికి సీబీఐను ఆదేశించింది. ఈ కారణంగా, కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

## అపోలో సహకారంతో పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం

**-జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఆధునిక ట్రామా కేర్, ఎమర్జెన్సీ విభాగాల ప్రారంభం**



**చిత్తూరు,** చిత్తూరులోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ట్రామా కేర్ సెంటర్ మరియు ఆధునీకీకరించిన ఎమర్జెన్సీ విభాగాన్ని సోమవారం రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి ప్రారంభించారు. రాయలసీమ ప్రాంత ప్రజలకు తక్షణ అత్యవసర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కాలికిరి మురళీమోహన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ది అపోలో మిగతా 2లో..



## ఎర్రావారిపాలెంలో విషాదం

**-కరెంట్ తీగలకు రెండు ఏనుగులు బలి**

**తిరుపతి,మార్చి9(నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రావారి పాలెం మండలంలోని నెరబైలు అడవికి సమీపంలో వేటగాళ్లు వేసిన కరెంట్ ఉచ్చులో చిక్కి రెండు ఏనుగులు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రావారిపాలెం మండలం నెరబైలు అడవికి సమీపంలోని సాయిబులపల్లె ప్రాంతంలో వేటగాళు అక్రమంగా కరెంట్ ఉచ్చులు వేశారు. అడవిలో నుంచి మేత కోసం పొలాల వైపు వచ్చిన రెండు గజరాజులు ఆ కరెంట్ ఉచ్చులో చిక్కి తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వేటగాళ్లు ఉద్దేశపూర్వకంగా కరెంట్ ఉచ్చు పెట్టడం వల్లనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనకు కారణమైన వేటగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

## జగన్ ఐదేళ్ల పాలన చెత్త పాలన

**-విమర్శలు గుప్పించిన మంత్రి నారాయణ**

**నెల్లూరు,మార్చి9(ఆర్ఎన్ఎ):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం చెత్త ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లపాటు చెత్తపాలన సాగించారని సెటైర్లు గుప్పించారు. సోమవారం నెల్లూరు జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో కోటి 53 లక్షల టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయని అన్నారు. మొత్తం చెత్తని క్లియర్ చేయమని సీఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి నారాయణ అన్నారు. ఇప్పటికీ కోటీ 15 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 10 వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు మొదలుపెట్టామని.. వాటిలో రెండు పూర్తి చేశామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో మిగిలిన వాటిని పూర్తిచేసి ఉంటే, ఈ పరిస్థితి ఉండేది కాదని చెప్పుకొచ్చారు.

## ఆడవాళ్ల గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉంది!

**-జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి సవిత**



**శ్రీసత్యసాయి,మార్చి9(ఆర్ఎన్ఎ):** సొంత తల్లి, చెల్లికి, చిన్నాన్న కుమార్తెకు న్యాయం చేయని వ్యక్తి వైఎస్ జగన్ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అభివర్ణించారు. ఇంట్లో వారిని బజారు పాలు చేశారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మంత్రి సవిత మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మహిళల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిండు అసెంబ్లీలో తల్లి లాంటి నారా భువనేశ్వరిని అవమానించారంటూ మండిపడ్డారు. తాడేపల్లి, పులివెందులలో మహిళలపై జరిగిన అత్యాచారాలు, దారుణాలు అంతా చూశారన్నారు. మహిళా ద్రోహి సీఎం చంద్రబాబు అంటూ జగన్ మాట్లాడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు పెట్టారంటూ సీఎంగా జగన్ వ్యవహరించిన తీరును ఈ సందర్భంగా మంత్రి సవిత తూర్పారబట్టారు. హిందువులు, మహిళలు, బీసీల అభివృద్ధి అంటే సరిపోదంటూ జగన్‌కు చురకలంటించారు. మీ హయాంలో జరిగిన అరాచకాలపై నివేదిక తయారు చేసి గవర్నర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. రాయలసీమ సాగునీటి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని కుండ బద్దలు కొట్టారు. వారు రాయలసీమ ద్రోహులు న్నారు. ఏ రోజు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం వైసీపీ నాయకులు సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు, మహిళలు చాలా క్లారిటీగా ఉన్నారు. మహిళా సాధికారత గురించి ఆలోచించింది పూలే ఆ తర్వాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ అని మంత్రి సవితా తెలిపారు. ప్పుడు ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు మాత్రమే మహిళా సాధికారత కోసం పని చేస్తున్నారని స్పష్టం చేశారు. మహిళలకు అన్ని అంశాల్లో ప్రాధాన్యత కల్పించింది సీఎం చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటా మహిళా ఎంటర్ ప్రెన్యూర్ రావాలన్నదే చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.

## మద్యం కేసులో ఇడి దూకుడు

**-నిందితులకు నోటీసులు జారీ**

**అమరావతి,మార్చి9(ఆర్ఎన్ఎ):** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ దూకుడు పెంచింది. మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్యలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను తీసుకురావాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొంది. విచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ మద్యం స్కామ్‌లో వేల కోట్ల రూపాయల కమీషన్లు, మనీలాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే రూ.441 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సీఐడీ సిట్ ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా కీలక నిందితులకు సంబంధించిన ఆస్తులను భారీ ఎత్తున జప్తు చేసింది. ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, చాణక్య, వాసుదేవరెడ్డికి చెందిన రూ.441 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## ఈశాన్య రాష్ట్రాల్లో దాడులు ఆందోళనకరం

**-అరుణాచల్ బీజేపీ ఎంపీ తపిర్ గావో**



**న్యూఢిల్లీ,మార్చి 9(ఆర్ఎన్ఎ):** ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సురక్షితం కాదని బీజేపీ ఎంపీ అన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు బీజేపీ ప్రభుత్వం ఉన్న దేశ రాజధానిలో ఈశాన్య ప్రజలపై జరుగుతున్న దాడులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ తపిర్ గావో సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాతి వివక్షత చూపడంతోపాటు దాడుల సంఘటనలు కొనసాగుతున్నాయని తెలిపారు. 'ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో కూడా ఈశాన్య ప్రాంతాల ప్రజలు జాతి వివక్ష, దాడులు, హత్యలను ఎదుర్కొంటున్నారు' అని అన్నారు. కాగా, ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని బీజేపీ ఎంపీ తపిర్ గావో తెలిపారు. తమ ప్రాంతం పౌరులను రక్షించడానికి బలమైన చట్టపరమైన చట్రాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. కేంద్ర హోంమంత్రిని కూడా ప్రతినిధి బృందం కలుస్తుందని అన్నారు. ఈశాన్య ప్రాంతాల ప్రజలపై వివక్ష, హింసను నివారించడానికి అట్రాసిటీ చట్టం లాంటి చట్టాన్ని తీసుకురావడాన్ని కేంద్రం పరిగణించాలని ఆయన సూచించారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదు ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం!

చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై రూ.80 పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గృహ వినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గృహావసరాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. 10 రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. మర్మజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానానికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10 డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది. చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి. పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందించిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషం గానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

## తాళాలు వేసిన ఇంటికి కన్నం

### ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు

**భీమవరం,మార్చి9(ఆర్ఎన్ఎ):** తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు సభ్యుల ముఠాను ముదినేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.45 లక్షలు విలువైన వెండి, బంగారు ఆభరణాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని కలిదిండి మండలానికి చెందిన నిందితులు గొల్ల వంశీ, కాలదేవి ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపల్లి ఎస్పీ ముని రాజా, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### బాణాసంచా తయారీ కేంద్రాలకు హెచ్చరిక

**కాకినాడ,మార్చి 9(ఆర్ఎన్ఎ):** వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఇటీవల పేలుడు సంభవించిన నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చర్యలు తీసుకుంటున్నారు. బాణసంచా తయారీలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ డీకే బాలాజీ.. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి కృత్తివెన్ను మండలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారీ కేంద్రాలు నిర్వహించినా, అనుమతులు ఉన్నప్పటికీ.. తయారీలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాలాజీ హెచ్చరించారు. సోమవారం కృత్తివెన్ను మండలంలోని పలు బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాల్లో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు చేశారు. మండలంలోని పడతడిక, చినగొల్లపాలెం, నిడమర్రు గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తయారీ కేంద్రాలకు లైసెన్సులు, ్ర÷ర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్, నిల్వ చేసేందుకు పరిమితులు ఉన్నాయో లేదో ఆరా తీశారు. శిక్షణ పొందిన వ్యక్తులే పని చేస్తున్నారా, బాల కార్మికులు ఉన్నారా? తదితర వివరాలను తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారా.. లేదా.. తెలుసుకున్నారు. కూలీల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యాన్ని సహించేది లేదని.. చిన్నారులతో ఎట్టి పరిస్థితుల్లో పని చేయించొద్దని హెచ్చరించారు.

## వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ.31,34,807

### లోక్‌సభలో కేంద్రమంత్రి వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి 9(ఆర్ఎన్ఎ):** దేశవ్యాప్తంగా రైతులకు వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ.31,34,807 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సోమవారం లోక్‌సభలో డీఎంకే సభ్యుడు రాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. పంట రుణాలు కింద రూ.16,34,219 కోట్లు.. టర్మ్ లోన్స్ కింద రూ.15,00,588 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే పలు రాష్ట్రాలరైతుల అప్పుల భారాన్ని ఈ సందర్భంగా గణాంకాలతో సహా వెల్లడించారు. ఈ జాబితాలో తమిళనాడు అగ్రస్థానంలో నిలవగా.. తెలుగు రాష్ట్రాలు ఏపీ రెండు, తెలంగాణ ఏడో స్థానాల్లో ఉన్నాయి.

## భారతీయులను రప్పించే ప్రక్రియ కొనసాగుతోంది: కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి 9(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి రప్పించే పక్రియ కొనసాగుతోందని పౌరవిమానయాన శాఖ వెల్లడించింది. పలు చోట్ల నుంచి 50 విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. గత 2 రోజుల్లో 100 సర్వీసుల్లో ప్రయాణికులను తరలించినట్లు వెల్లడించింది. దుబాయ్, అబుదాబి, రస్ అల్ ఖైమా, ఫుజైరా, మస్కట్, జెడ్డాల నుంచి విమానాలు సురక్షితంగా నడిచాయని ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయా విమానాశ్రయాల్లో పరిస్థితులు, సాధ్యాసాధ్యాలకు అనుగుణంగా విమానాలు నడుస్తున్నట్లు పేర్కొంది. టికెట్ ధరలు సహేతుకంగా ఉండేలా విమాన ఛార్జీలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ వెల్లడించింది.

## పోలవరం జిల్లాలో పులి సంచారం

### 20 రోజులుగా స్థానికుల ఆందోళన

**పోలవరం,మార్చి9(ఆర్ఎన్ఎ):** పోలవరం జిల్లాలో గత 20 రోజులుగా పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఈ పులి మొదట్లో పోలవరం జిల్లాలోని అడవి ప్రాంతాల్లో, రంపచోడవరం, అడ్డతీగల మండలాల పరిసరాల్లో కనిపించింది. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు తూర్పు గోదావరి జిల్లాలోకి వెళ్లి, ఏలేశ్వరం మండలం పరింతడక, మర్రివీడు ప్రాంతాల్లో పశువులపై దాడులు చేసింది. అక్కడ గేదెలు, దూడలను దాడి చేసి చంపేసింది. దీంతో అటవీ అధికారులు అప్రమత్తమై, పులిని బంధించేందుకు విస్తృతంగా చర్యలు చేపట్టారు. అయితే, పులి మళ్లీ తప్పించుకుని పోలవరం జిల్లాలోనికి తిరిగి ప్రవేశించింది. ప్రస్తుతం రాజవొమ్మంగి రేంజ్ పరిధిలోని సర్రంపేట అడవి ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని, ఒంటరిగా తిరగవద్దని సూచించారు. పశువులను అడవి ప్రదేశాలకు తీసుకెళ్లి మేపవద్దని, రాత్రి వేళల్లో బయటకు రావద్దని, పశువులను సురక్షితంగా ఉంచాలని కోరారు. పులిని సురక్షితంగా బంధించేందుకు పెద్ద ఎత్తున గాలింపు, ఆపరేషన్ చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల వీరభద్రపురం, కొనలోవ, గొందోలు, గవరయ్యపేట, కొట్టంపాలెం వంటి గ్రామాల పరిసరాల్లో పులి జాడలు, పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. యేలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం నుంచి రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలోకి పులి ప్రవేశించినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

## దస్త్రాల దోషులకు బెయిల్ నిరాకరణ

**న్యూఢిల్లీ,మార్చి9(ఆర్ఎన్ఎ):** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రెవెన్యూ దస్త్రాల దహనం కేసులో ఇద్దరు నిందితులకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఏ3గా ఉన్న మాధవరెడ్డి, ఏ4గా ఉన్న మునిరత్నానికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. దర్యాప్తు పురోగతికి తాము అడ్డురాలేమని జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. నిందితుల్లో ఒకరు మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాజీ పీఏ కాగా, మరొకరు ప్రధాన అనుచరుడిగా ఉన్నారు.

## ఏఐ మీద కాదు ప్రజారోగ్యం మీద దృష్టి పెట్టండి!

### పాలకల్తీ బాధితులను ఆస్పత్రిలో పరామర్శించిన షర్మిల

**అమరావతి,మార్చి9(ఆర్ఎన్ఎ):** కల్తీ పాలు తాగిన ఘటనలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం రాజమండ్రి ఆసుపత్రిలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి తెలుసుకొని, బాధిత కుటుంబాలను ఓదర్చారు. ఈ ఘటనలో 11 మంది మరణించగా, ఇంకా 9 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడటం చూస్తే, రాష్ట్రంలో కనీసం స్వచ్ఛమైన పాలు కూడా అందించడంలో నిఘా పెట్టలేని ప్రభుత్వం ఉంటే ఎంత ఊడితే ఎంత అంటూ మండిపడ్డారు. ఏఐ మీద పెట్టే శ్రద్ధలో పావు వంతైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారోగ్యం మీద పెట్టాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. జనాభా కనమని చెప్పడం కాదు. ఉన్న వాళ్లకు ప్రజారోగ్యంపై భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి కల్తీ పాల ఘటనలో సంభవించిన 11 మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలేనని ఆరోపించారు. చనిపోయిన కుటుంబాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేవారు. రాష్ట్రంలో పాలు కల్తీ, నెయ్యి కల్తీ, మద్యం కల్తీ, వాగ్దానాలు కల్తీ. మొత్తం పాలనే కల్తీ అని విమర్శించారు. 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండా వరలక్ష్మి డైరీ నడుస్తుంటే చర్యలేవి ? తనిఖీలు ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన యాదృచ్ఛికం కాదు. పూర్తి నిర్లక్ష్యమని అన్నారు. సైతాన్ సైన్యానికి ఆపద వస్తే తప్పా జగన్ మోహన్ రెడ్డి సైతం బయటకు రారని ఆరోపించారు.

## దండి మార్చ్‌ను జయప్రదం చేయండి



**పలమనేరు, మార్చి 9( నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాదక ద్రవ్యాలను అరికట్టాలనే లక్ష్యంతో ఏ.పీ.టి.డి.సి ఆధ్వర్యంలో ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న దండి మార్చ్. 2.0 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పిలుపునిచ్చారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబందించిన కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మాదక ద్రవ్యాల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యల వాడకంతో జరిగే అనర్థాలపై అందరిలో అవగాహన రావాలన్నారు. ముఖ్యంగా యువత ఈ విషయంలో నడుం బిగించి మాదకద్రవ్యాల రహిత సమాజానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఈ నెల 12న పట్టణంలో జరిగే 100 మీటర్ల జాతీయ పతాక ర్యాలీ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోప్రోగ్రాం కోఆర్డినేటర్ రమణ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ప్రమీలమ్మ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటగిరి-బాలాయపల్లి రోడ్డు పనులు ప్రారంభించకపోతే చర్యలు

### -రోడ్లపై ఆలస్యం సహించం: ఎమ్మెల్యే రామకృష్ణ హెచ్చరిక



**వెంకటగిరి, మార్చి 9(నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెంకటగిరి-బాలాయపల్లి రహదారి పనుల్లో కొనసాగుతున్న ఆలస్యంపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే ప్రస్తుత కాంట్రాక్టర్‌ను మార్చాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా పనులు వాయిదా పడటాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని లోని తెలుగు గంగ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే గారు సమగ్రంగా చర్చించారు. ఈ రహదారి పనులకు ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసినప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు దుస్థితి కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా పనులు ఆలస్యం కావడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే వెంటనే కాంట్రాక్టర్‌ను మార్చాలి" అని అధికారులకు ఎమ్మెల్యే గారు ఆదేశించారు. పనుల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నాణ్యత విషయంలో రాజీపడకూడదని కూడా స్పష్టం చేశారు. నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులు నిర్మించడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గారు పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

## శ్రీవారికి అపచారం చేస్తే ఊరుకోం!





ముఖ్యమంత్రి పరిశీలించారు. ఫ్రూట్ కవర్ల వాడకం వల్ల పండ్లకు మంచి ధర లభిస్తుందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు ఆదేశించారు. కవర్ తొడిగిన పండ్ల నాణ్యతను, కవర్ లేని పండ్ల నాణ్యతను సీఎం స్వయంగా పరిశీలించారు. జిల్లాలో మంచి రేట్లు రావడానికి వివిధ వెరైటీల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాల స్థాయిలు పెరిగేలా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## అపోలో సహకారంతో పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం




యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్ భట్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో రాష్ట్రంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రిని అపోలో సంస్థ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలోనే కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్య సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. రోగి ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు అన్ని వైద్య సేవలను మెరుగుపరిచే చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. పేదలకు ఎటువంటి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. అవసరమైన సందర్భాల్లో చెన్నై, బెంగళూరు నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా చికిత్సలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నా మని వివరించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన బాధితులకు తక్షణమే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ ట్రామా కేర్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలోనే ఆధునిక సదుపాయాలతో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ విభాగంలో 60 పడకలను అత్యవసర వైద్య సేవల కోసం సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ట్రామా కేర్ సెంటర్లో అత్యాధునిక వెంటిలేటర్లు, హీమోడైనమిక్ మానిటరింగ్ సిస్టమ్స్, డిజిటల్ ఎక్స్రే, పాయింట్ ఆఫ్ కేర్ టెస్టింగ్ (గూజు) వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఎమర్జెన్సీ విభాగంలోనే ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ను ఏర్పాటు చేశారు. రోగుల పరిస్థితిని బట్టి రెడ్, యెల్లో, గ్రీన్ జోన్లుగా విభజించి తక్షణ చికిత్స అందించే విధంగా ఎమర్జెన్సీ విభాగాన్ని రూపకల్పన చేశారు. కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె అగస్టిన్, యూనిట్ హెడ్ ఎస్. బాలరాజ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బి.జి., ఎఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్స్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వైద్యులు, అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి నెయ్యి కొరత లేదు

భక్తులకు పంపిణీ చేయడానికి సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపింది. అందువల్ల లడ్డూ ప్రసాదాల తయారీ, పంపిణీ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని వెల్లడించింది. అదేవిధంగా వేసవి కాలంలో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు టిటిడి పేర్కొంది. లడ్డూ తయారీకి సంబంధించిన పోటు విభాగంలో యంత్రాల నిర్వహణ, కన్వేయర్ బెల్ట్‌లు వంటి పరికరాల మరమ్మతులు సంబంధిత సంస్థల ద్వారా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపింది. వాస్తవాలు ఇలా ఉండగా టిటిడి వద్ద నెయ్యి నిల్వలు లేవని, శ్రీవారి కైంకర్యాలకు, లడ్డూ ప్రసాదాల తయారీకి ఆటంకం కలుగుతోందని అసత్య ప్రచారం చేయడం బాధాకరం. ఇటువంటి తప్పుదోవ పట్టించే ప్రచారాలు భక్తుల మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉన్నందున ప్రజలు, భక్తులు వాటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తోంది. శ్రీవారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లడ్డూ ప్రసాదాల తయారీ, పంపిణీ పూర్తిస్థాయిలో కొనసాగుతోందని టిటిడి మరోసారి స్పష్టం చేసింది.

## విద్యార్థులను ఇబ్బంది పెట్టే అధికారిని ఉపేక్షించేది లేదు

**- హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేసిన ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్**



**వి.కోట, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపి ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తావిజయ ప్రతాప్ రెడ్డి వి.కోట ప్రభుత్వ ఎస్సీ హాస్టళ్లలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వంటగది అపరిశుభ్రత, నాణ్యత లేని ఆహారంపై విద్యార్థుల నుండి ఫిర్యాదులు అందడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా మారకపోతే ఉద్యోగాలు పోతాయని హెచ్చరిస్తూ, సమస్యలను చీటీల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగించే ఏ అధికారిని ఉపేక్షించేది లేదని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఉదయం పట్టణంలోని పలు సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎస్సి హాస్టల్ వార్డెన్ కొంతమంది విద్యార్థులు ఆహార పదార్థాలు సరిగా అందించడం లేదని ఫిర్యాదు చేసారని వివరించారు. అలాగే వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు రాత్రిపూట బయటకు వెళ్లిపోతున్నారని ఆరోపణలు వచ్చాయని అన్నారు. ఇదే విషయంపై ఆయన వార్డెన్ వద్ద నుండి వివరణ అడిగి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ పరిస్థితి ఏమీ బాగోలేదని, హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టినా ఫలితం లేకపోవడం వలన ఎంతో బాధ కలుగుతుందని అన్నారు. ఇకపై అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎటువంటి పరిస్థితులలో కూడా ఉపేక్షించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఆయన సోమవారం కూడా నియోజకవర్గ పరిధిలోని పలుచోట్ల తనిఖీలు నిర్వహిం చనున్నట్లు తెలిసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇందులో రెవెన్యూ సిఎస్డీటి శ్యాం ప్రసాద్ రెడ్డి, వీఆర్వో కృష్ణ మరియు సిబ్బంది ఉన్నారు. నాణ్యత లేని ఆహారం, సరైన పర్యవేక్షణ లేకపోవడం మరియు నాణ్యత లేని ఆహారం వండుతున్నట్లు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వార్డెన్లకు హెచ్చరిక పద్ధతులు మార్చుకోక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని వార్డెన్లను హెచ్చరించారు. విద్యార్థుల ఇబ్బందులు తాగు నీటి సమస్యలు, అపరిశుభ్రమైన పరిసరాలు, వసతి సమస్యలను విద్యార్థులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. హాస్టళ్లలో విద్యార్థుల భోజనం, వసతి సౌకర్యాలపై సమగ్ర విచారణ చేపట్టి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

## యు.పి.ఎస్ఈలో 360 ర్యాంక్ సాధించిన జయశ్రీకి ఘన సన్మానం



**పలమనేరు, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యుపిఎస్‌సి, సీ.ఎస్ఈ 2025లో 360 ర్యాంక్ సాధించిన రాయళం జయశ్రీ సాయి శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, గంగవరం నందు తన ఇంటర్ విద్యను అభ్యసించింది. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి సుధా తమ పూర్వ విద్యార్థిని అభినందిస్తూ సన్మానం చేశారు. జయశ్రీ మొదటినుండి పట్టుదల కల విద్యార్థి అనీ, తమ కళాశాల లో చదువుతున్నప్పుడు కూడా మంచి ప్రతిభ కనపరచి కాలేజ్‌లో ఉత్తమ మార్కులు తెచ్చుకుందని కరెస్పాండంట్ ఎం.వీఆర్. రెడ్డి, అధ్యాపకులు గుర్తుచేసుకున్నారు. ఆమె తన శిష్యురాలు అయినందుకు గర్వంగా వుందని, జయశ్రీ భావితరాలకు స్ఫూర్తి అని వారు కొనియాడారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా తీర్థం గ్రామస్థులకు తోఫా పంపిణీ



**పలమనేరు,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాసనసభ్యులు అమరనాథ రెడ్డి చేతుల మీదుగా బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామానికి చెందిన మైనార్టీ సోదర సోదరీమణులకు సోమవారం రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. తీర్థం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు ఎంబీఎస్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో వందమంది మైనారిటీలకు 21 రకాల నిత్యావసర వస్తువులతో కూడిన కిట్‌ను ఎమ్మెల్యే ఈ సందర్భంగా పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా తోఫాను అందించడం చాలా ఆనందంగా ఉందని, దాన్ని ఏర్పాటు చేసిన మహబూబ్ బాషా కుటుంబీకులను ఆయన అభినందించారు. అదేవిధంగా అక్కడి మైనారిటీ సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కిషోర్ గౌడ్, సుబ్రహ్మణ్యం శెట్టిలతో పాటు తీర్థం పంచాయతీ నాయకులు గోవిందస్వామి, శీనా విశ్వనాథ్, రమేష్, రహంతుల్లా, నిజాం, నదీమ్ మురళీ, కృష్ణప్ప, వెంకట్రమణలు తదితరులు పాల్గొన్నారు.

## మార్గ మహేశ్వర స్వామి వసంతోత్సవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**పలమనేరు,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గం లోని బైరెడ్డి పల్లి మండలం నెల్లిపట్ల గ్రామంలో వెలసియుండు మార్గ మహేశ్వర దేవస్థాన వసంతోత్సవ పూజా కార్యక్రమాలలో శాసనసభ్యులు అమరనాథ్ రెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే ఈ ఆలయ తిరునాళ్ళల్లో చివరి రోజు నిర్వహించిన పూజల్లో ఆయన తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు సాధర స్వాగతం తెలియజేయగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆ దేవుని ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలందరిపై ఉండాలని పంటలు బాగా పండి అందరూ ఆయురారోగ్యాలతో రాణించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాలలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కిషోర్ గౌడ, సుబ్రహ్మణ్యం శెట్టి, సింగిల్ విండో చైర్మన్ నాగరాజు, జయప్ప, రమేష్ రెడ్డి, గోవర్ధన్ జగదీష్, విల్వనాథ్, అరుణ్, పళని, ఉపేంద్ర, తిప్పారెడ్డి, రెడ్డప్ప, దేవేంద్ర, కళ్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ సమస్యలను సత్వరం పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురం,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఎస్డీసిలు రామ్మోహన్, ఆనంద్, మల్లికార్జునుడు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 463 అర్జీలను స్వీకరించారు. ఇందులోభాగంగా రెవెన్యూ క్లినిక్‌ని తనిఖీ చేసి, అర్జీదారులతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను పరిశీలించడం జరిగిందన్నారు. రెవెన్యూ క్లినిక్‌లో భాగంగా తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, ఆర్ఐలు స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నారన్నారు. ఈ ప్రక్రియలో ముఖ్యంగా మీసేవ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ప్రాసెస్ చేయడం, ఆర్ఓఆర్ వంటి పాత కేసులను రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేయడం వంటి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 వరకు ఫిర్యాదులు అందుతుండగా, అందులో 350 పైగా రెవెన్యూకి చెందినవి ఉన్నాయని, ఇందులో 80 శాతం కొత్త ఫిర్యాదులే ఉంటున్నాయన్నారు. ప్రతి చిన్న సమస్యకు జిల్లా కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేదని ప్రజలకు విన్నవించారు. ప్రజలు వారి మండల కేంద్రంలో లేదా డివిజనల్ కేంద్రంలోని పీజీఆర్ఎస్ కౌంటర్లలో ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిపిఓ నాగరాజునాయుడు, జడ్పి సిఈఓ శివశంకర్, జిల్లా వ్యవసాయ అధికారి రవి, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

**- ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని దరి చేరనీయొద్దని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆ సంస్థ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 52 వినతులు అందినట్లు తెలిపారు. తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత నోడల్ ఆఫీసర్లు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్/ ఫైనాన్స్(ఎఫ్‌ఎసి) కె.రామ మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, యం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చి నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

**- అప్పలాయగుంట -కమ్మపల్లి రోడ్డు నిర్మాణం పూర్తి**



**నగరి, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రూ.1 కోటి 34 లక్షల వ్యయంతో అప్పలాయగుంట -కమ్మపల్లి రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 3.5 కిలోమీటర్లు కమ్మపల్లి-అప్పలాయిగుంట రోడ్డుకు అధ్వాన పరిస్థితి 2024 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నేటి ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో నాబార్డ్ నిధుల ద్వారా రూ.1 కోటి 31 లక్షల నిర్మాణ వ్యయంతో వడమాలపేట మండలం అప్పలాయగుంట, రామచంద్రాపురం, కమ్మపల్లికు వెళ్లే బీట్ రోడ్డుకు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శంకుస్థాపన చేసారు. శనివారపు రోజులలో శ్రీవారి భక్తులు తిరుపతి, రామచంద్రాపురం కమ్మపల్లి, మరెన్నో గ్రామాల నుంచి అప్పలాయి గుంట చేరుకోవడం శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని దర్శించుకోవడం సులభతరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. గతంలో గుంతలతో ఇబ్బందులు పడ్డ 2 మండలాల ప్రజానీకం నేడు సులభంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎమ్మెల్యేకు పలు గ్రామస్థులు, శ్రీవారి భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కైలాసధామం నిర్మాణ పనుల పరిశీలన



**చంద్రగిరి, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో నిర్మాణంలో ఉన్న కైలాసధామం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కైలాసధామంలో నిర్మిస్తున్న శివుడు విగ్రహం, పరిపాలన భవనం పనులను పరిశీలించి పనుల పురోగతిపై కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. ఈ అభివృద్ధి పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు.కైలాసధామం అభివృద్ధికి దాతలు విరాళాలు ప్రకటించారు. చంద్రగిరి మండలం పిచ్చినాయుడు పల్లి గ్రామానికి చెందిన సూరినేని సుబ్రహ్మణ్యం నాయుడు కుమారులు సూరినేని సురేష్, సూరినేని రమేష్ కలిసి రూ.1,27,400 విరాళంగా ప్రకటించారు. అలాగే అగ్రహారం పంచాయతీకి చెందిన టిడిపి నాయకుడు జగన్మోహన్ నాయుడు రూ.3 లక్షలలు విరాళంగా ప్రకటించారు. విరాళాలు ప్రకటించిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ వారిని అభినందించారు. కార్యక్రమంలో కైలాసధామం కమిటీ సభ్యులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి టీకా పోస్టర్ల ఆవిష్కరణ

**అనంతపురం, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ గౌరవనీయులు ఏ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు హెచ్‌పివి టీకా పోస్టర్లను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈహెచ్‌పివి వ్యాక్సిన్ 28 ఫిబ్రవరి 2026 తేదీ నాటికి 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అమ్మాయిలకు మాత్రమే ఇవ్వడం జరుగుతుంది. ఈ టీకా తీసుకోవడం వలన సదరు బాలికలకు భవిష్యత్తు నందు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లను నివారించవచ్చునని ఈ టీకా కార్యక్రమంను ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా 28 26వ తేదీన ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాకు మొదటి విడతగా 6390 మోతాదుల్లా టీకా ముందు రావడం జరిగింది. ఆ టీకా ముందును జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరం మేరకు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులైన డీఈఓ కృష్ణప్ప, ఐసిడిఎస్ పిడి శ్రీమతి ప్రమీల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీమతి ఎస్‌ఫై రోజా బేగం, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్, మెప్మా పీడీ నాగరాజు పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లా

## శ్రీకాళహస్తిలో విశ్వబ్రాహ్మణుల ఐక్యత సమావేశం



**శ్రీకాళహస్తి రూరల్, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధర్మరాజుల స్వామి ఆలయం సమీపంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చంద్ర ఆచారి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన సభ్యులు, పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమాజ అభివృద్ధి, ఐక్యత బలోపేతం, యువతకు విద్యా ప్రోత్సాహం అందించడం, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఐక్యతతో ముందుకు సాగితే విశ్వబ్రాహ్మణ సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## ఈ నెల 21, 22 తేదీల్లో రైతు సంఘం మహా సభలు




**తొట్టంబేడు, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి వేదికగా ఈ నెల 21, 22 తేదీల్లో జరగబోయే ఏపీ రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో సోమవారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. హేమలత మాట్లాడుతూ.. జిల్లాలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని తెలిపారు. వరి అధికంగా పండే తూర్పు మండలాల్లో గిట్టుబాటు ధర లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దళారీలే ధరలు నిర్ణయిస్తున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని మండిపడ్డారు. ఉన్నా అవి మిల్లర్లకు దళారీగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల కారణంగా సూళ్ళూరు పేట మండలంలో 350 ఎకరాల్లో రైతులు పంట నష్టపోతే ప్రభుత్వం కనీసం పరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తపరిచారు. ఇంకా పరిష్కారం కాని రైతాంగ సమస్యలు ఎన్నో ఉన్నాయనీ, వాటిన్నంటినీ మహ సభల్లో చర్చించి ఉద్యమ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. మాజీ జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య, రంగయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేద కుటుంబాలను ఆదుకుంటున్నాం!

**- నలుగురికి రూ.8 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పులివర్తి నాని**



**రామచంద్రాపురం,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలాలలో అనారోగ్యం, ఇతర సమస్యలతో ఇబ్బందు లుపడి ఆర్థికంగా చితికిన కుటుంబాలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ రిసార్ట్స్ లోని నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామాల పర్యటన సందర్భంగా బాధితులు తమ సమస్యలను ఎమ్మెల్యే పులివర్తి నానికి చెప్పుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని బాధితుల దరఖాస్తులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా నియోజకవర్గంలోని ఆర్సీపురంలో నలుగురు బాధితులకు రూ.8 లక్షలు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కష్టకాలంలో మా కుటుంబాలను ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ ఎన్ చిన్నబాబు, మేకల తిరుమలరెడ్డి, సి జనార్ధన్ చౌదరి, నీలకంఠ చౌదరి, సాయి రెడ్డి, బి ధనుంజయులు, బండి విజయ్ కుమార్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, మధుసూదన్ రెడ్డి, ఆకా దేవరాజులు, బండి రమణారెడ్డి జవహర్ రాయల్, గుర్రం దేవరాజు రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష : రూ.6 లక్షల జరిమానా

**- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి**



**తిరుపతి,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి శ్రీ నరసింహ మూర్తి సోమవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె.కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 10/2016 కేసులో ముద్దాయి తిరుపతి జిల్లా కరకంబాడీ ఫారెస్ట్ బీటు, సెక్షన్ అటవీ పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లా కు చెందిన గోవిందన్ పొన్నుస్వామి, కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని కడప జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

## పిజిఆర్ఎస్ సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయసారధి, ఎస్డీసీ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నేడు మొత్తం 265 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

# పుంగనూరు గంగమ్మ జాతరకు పటిష్టమైన ‘చక్రవ్యూహం’

**దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌ల అరికట్టేందుకు క్రైమ్ పార్టీలు**

**ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో పకడ్బందీ బందోబస్తు**



**పుంగనూరు,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరను పురస్కరించుకుని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు చేస్తోందని, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. సోమవారం పుంగనూరులో బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ, మీడియా ముఖంగా పలు కీలక సూచనలు చేశారు. జాతర జరిగే పరిసరాల్లో అదనపు సీసీ కెమెరాలతో పాటు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచడం జరుగుతుంది. జాతర రద్దీని ఆసరాగా చేసుకుని పిక్ పాకెటింగ్, చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడే ముఠాలను అరికట్టేందుకు అనుభవజ్ఞులైన క్రైమ్ పార్టీలను రప్పించామన్నారు. ఇప్పటికే 4 ప్రత్యేక క్రైమ్ టీమ్స్ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించామన్నారు. భక్తుల క్యూ లైన్లను క్రమబద్ధీకరించడానికి అదనపు సిబ్బందిని వినియోగిస్తున్నామని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని, ఈవ్ టీజర్లను అరికట్టడానికి ప్రత్యేకంగా ‘శక్తి టీమ్స్’ను రంగంలోకి దించామన్నారు. ఆలయం సమీపంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, భక్తులకు ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి ఇప్పటికే రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండ్ ఓవర్ చేయడం జరిగింది. జాతర సమయంలో అక్రమ మద్యం విక్రయాలపై పోలీస్, అబ్కారీ శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తాయన్నారు. భక్తులందరూ పోలీసులకు సహకరించి, జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పుంగనూరు సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ అన్సర్ భాష, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విమానాశ్రయ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రూ.40 కోట్ల పంపిణీ



**రామకుప్పం, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మండల సమీపన ప్రభుత్వం నిర్మించి తలపెట్టిన మన ఆశ్రయానికి భూములు ఇచ్చిన70 మంది రైతులకు కుప్పం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు పిఎస్ మునిరత్నం, పీకే యం హుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్పోర్ట్ నిర్మాణానికి భూములు ఇచ్చిన ప్రతి ఒక్క రైతుని అన్ని విధాల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదుకుంటాడని అతి త్వరలో విమానాశ్రయ పనులు కూడా ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. మండలంలో విమానాశ్రయం నిర్మాణం వల్ల ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమలు ఏర్పడి యువతకు ఉపాధి కల్పిస్తూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఎదిగేందుకు పరోక్షంగా తోడ్పడుతుందని పేర్కొన్నారు ఎయిర్పోర్ట్, పరిశ్రమల స్థాపనతో కుప్పం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, తక్కిన ప్రాంతాలు సైతం ప్రత్యక్షంగా పరోక్షంగా అభివృద్ధి చెందుతూ దేశంలనే కుప్పం అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు భూములు ఇచ్చిన రైతులకు పలుమార్లు నగదు పంపిణీ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ప్రతి కుటుంబానికి ప్రత్యక్షంగా పరోక్షంగా తెలుగుదేశం పార్టీ అండగా నిలిచి అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు త్వరలో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకు స్థాపన చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునుస్వామి, మండల తహసిల్దార్ కౌలేష్, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, ఎంపీపీ సులోచన గుర్రప్ప, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పట్రానారాయణ చారి, నీటి సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, రామమూర్తితో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఆర్ట్ క్యాంపులో యాదమరి కళాకారుడి ప్రతిభ



**యాదమరి,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కళాతపస్వి ఆధునికాంధ్ర చిత్రకళకు అధ్యుడు, ఆరాధ్యుడు, ప్రపంచ ఖ్యాతిని గాంచిన దామెర్ల రామారావు మార్చి 8, 130వ జయంతిని పురస్కరించుకొని రాజమండ్రి చిత్రకళా నికేతన్ రాష్ట్ర నలుమూలల నుండి సృజన శీలురైన 30 మంది చిత్రకారులతోటి “వన్ డే” కళా శిబిరాన్ని, దామెర్ల రామారావు ప్రభుత్వ ఆర్ట్ గ్యాలరీ, రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయడం జరిగింది. పూతలపట్టు నియోజకవర్గం యాదమరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఆర్ట్ మాస్టర్, కె.దామోదరాచారి చిత్రకళ శిబిరంలో పాల్గొని “చిగురించిన ఆధ్యాత్మిక జీవితం” చిత్రాన్ని అక్రిలిక్ రంగులో చిత్రించి, చిత్రకళ ప్రదర్శనలో వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ అండ్ స్కూల్ ప్రిన్సిపల్ మాదేటి రాజాజీ శిష్యులై కే సీతారాం కి కె.దామోదరాచారి శిష్యులు కావడం విశేషం. చిగురించిన ఆధ్యాత్మిక జీవితం: 18 × 24 పరిమాణంలో అక్రిలిక్ రంగులతో ప్రతీక వాదం టెక్నిక్‌తో చిత్రించిన అబ్ స్ట్రాక్ట్ పెయింటింగ్ చిత్రించారు. రాజమండ్రి చిత్ర కళ నికేతన్, వ్యవస్థాపక కార్యదర్శి మృత్యుంజయరావు, కన్వీనర్ మాదేటి రవి ప్రకాష్, మద్దూరి శివ సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ కల్చరల్ కమిషన్, విజయవాడ చైర్ పర్సన్ శ్రీమతి తేజశ్రీ దామోదరాచారిని ఘనంగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కరించారు.



# చిత్తూరు జిల్లా

## మార్గ సాహేశ్వర స్వామి వసంతోత్సవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**బైరెడ్డిపల్లి, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం లోని నెల్లిపట్ల గ్రామంలో వెలసియుండు మార్గ సాహేశ్వర దేవస్థాన వసంతోత్సవ పూజా కార్యక్రమాలలో శాసనసభ్యులు అమరనాథ్ రెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించే ఈ ఆలయ తిరునాళ్ళల్లో చివరి రోజు నిర్వహించిన పూజల్లో ఆయన తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు సాధర స్వాగతం తెలియజేయగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆ దేవుని ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలందరిపై ఉండాలని పంటలు బాగా పండి అందరూ ఆయురారోగ్యాలతో రాణించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాలలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కిషోర్ గౌడ, సుబ్రహ్మణ్యం శెట్టి, సింగిల్ విండో చైర్మన్ నాగరాజు, జయప్ప, రమేష్ రెడ్డి, గోవర్ధన్ జగదీష్, విల్వనాథ్,అరుణ్, పళని, ఉపేంద్ర, తిప్పారెడ్డి, రెడ్డప్ప, దేవేంద్ర, కళ్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడేపల్లెకు గఫూర్ బదిలీ.. రామసముద్రానికి కృష్ణవేణి రాక



**రామసముద్రం, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**ఎంపీడీవో కార్యాలయంలో నూతన డిప్యూటీ ఎంపీడీవోగా కృష్ణవేణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ చౌడేపల్లె మండలానికి బదిలీ కావడంతో, అక్కడ పనిచేస్తున్న కృష్ణవేణి బదిలీపై రామసముద్రానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది కృష్ణవేణికి అభినందనలు తెలియజేసి స్వాగతం పలికారు. అలాగే బదిలీపై చౌడేపల్లెకు వెళ్తున్న డిప్యూటీ ఎంపీడీవో గఫూర్‌కు సిబ్బంది పూలమాల వేసి శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో లతీఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్ నిరాహార ఆరోపణలు మానుకో!

**- పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు**



**రామకుప్పం,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**ఎమ్మెల్సీ భరత్ తాను రాష్ట్ర శాసన మండలిలో చేసిన నిరాదార ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని కేవలం తన ఉనికిని చాటుకోవడానికి పత్రికలకు, మీడియా ముందుకు వచ్చి అవాస్తవాలు మాట్లా డడం తగదని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి పికేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం సమీపంలో గల ప్రభుత్వ ఎస్టీ హాస్టల్‌కు సంబంధించిన భూములను స్థానిక తహసిల్దార్ కౌలేష్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్ మోహన్‌తో కలిసి పరిశీలించారు, ఈ సందర్భంగా ఎస్టీ హాస్టల్ సమీపంలో ఖాళీగా ఉన్న భూమిలో కేవలం నాలుగు సెంట్లు మాత్రమే ఓ రైతు తన పరిధిలోకి వస్తుందన్న నెపంతో దాని అనుభవిస్తున్నారని ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఆ భూమిని సంబంధిత హాస్టల్ కు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ చిన్న విషయానికి వైకాపా నేతలు పలువురు ప్రజా సంఘ నేతలు రాజకీయ రంగు పులిమి కొండంతను గోరంతలు చేయడం సబబు కాదని తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు ప్రజా ప్రయోజనాలే కోరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. వైకాపా నేతలకు చిత్తశుద్ధి ఉంటే గతంలో రామకుప్పం మండల కేంద్రంలో జగనన్న కాలనీ పేరిట పంపిణీ చేసిన ఇంటి పట్టాల విచారణకు సిద్ధమని వారు సవాల్ చేశారు. గురువారం నాడు జగనన్న కాలనీలో అధికారుల సమక్షంలో విచారణ జరుగుతున్నట్లు వైకాపా నేతలు తమ నిజాయితీని నిరూపించుకోవడానికి కాలనీ వద్దకు రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ మునస్వామి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, ఎంపీపీ సులోచన గుర్రప్ప, మాజీ మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి పట్రా నారాయణ, కుప్పం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, వైస్ ఎంపీపీ వెంకట్రామయ్య గౌడ, ముఖ్య నేతలు రామమూర్తి, రామకృష్ణప్ప పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అపోలో నాలెడ్జ్ సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**చిత్తూరు, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అపోలో నాలెడ్జ్ సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళల శక్తి, ధైర్యం, సమాజ అభివృద్ధిలో వారి పాత్రను గుర్తు చేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(చూడా) చైర్‌పర్సన్ కటారి హేమలత, అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సతీమణి, మాజీ ఓబీజీ ప్రొఫెసర్ డాక్టర్ పార్వతి భట్ హాజరయ్యారు. వారు దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చూడా చైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ మహిళలు ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని ముందుకు సాగాలని అన్నారు. నర్సులు సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. తల్లి విద్యావంతురాలైతే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మహిళా విద్య కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే, అంతరిక్షంలో అడుగుపెట్టిన కల్పనా చావ్లా, స్వాతంత్ర్య సమర యోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్, క్రీడాకారిణి పి.వి.సింధు వంటి మహిళల విజయాలను ఉదాహరణగా వివరించారు. డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి స్ఫూర్తితో వారి కుమార్తెలు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. మాజీ ఓబీజీ ప్రొఫెసర్ డాక్టర్ పార్వతి భట్ మాట్లాడుతూ తాను గత 40 సంవత్సరాలుగా మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నానని, ఈ కాలంలో మహిళల పరిస్థితుల్లో వచ్చిన మార్పును సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారత కొంతమందికే పరిమితం కాకుండా ప్రతి మహిళకు చేరాలని చెప్పారు. కుటుంబం నుంచే మహిళా సాధికారత ప్రారంభమవాలని పేర్కొన్నారు. ఇంటి పనులు మహిళలకే పరిమితం అన్న భావజాలం మారాలని, పురుషులు కూడా సమానంగా బాధ్య తలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ది అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, ఏఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె.అగస్టిన్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్య రామకృష్ణన్, నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయంతి, ఎడబ్ల్యూఈసి కన్వీనర్ డాక్టర్ ఎస్. హసీనా, కో–కన్వీనర్ డాక్టర్ శాని ఎస్.ఎస్., ఐసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ జి.బి.హిమబిందు, ఏఐఎంఎస్ఆర్ స్టూడెంట్స్ అఫైర్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ దీప్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ. గాయత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో మహిళల గౌరవాన్ని పెంపొందించేందుకు డిగ్నిటీ ఛాంపి యన్స్, క్యాంపస్ అంబాసిడర్లను ప్రకటించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజిక్ బ్యాండ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఆటోను ఢీకొన్న బొలోరో

**- ముగ్గురికి గాయాలు**



**పుంగనూరు, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని భీమగాని పల్లి సర్కిల్ సమీపంలో ఆదివారం రాత్రి 9 గంటల బంగారుపాల్యం నుండి మదనపల్లికి వెళుతున్న ఆటోను మదనపల్లి వైపు నుండి వస్తున్న బొలోరో వాహనం ఢీకొనడంతో ఆటోలో వెళ్తున్న బంగారు పాల్యంకు చెందిన సూర్య(38), రవి కుమార్(40), ప్రకాష్(38)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## జోరుగా గంగమ్మ జాతర ఏర్పాట్లు



**పుంగనూరు,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో సూగుటూరు గంగమ్మ జాతర ఈనెల 10, 11 తేదీలలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. అనాది నుంచి జమీందారుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాతర ప్రస్తుతం జమీందారుల వంశస్తులు రాజా సోమశేఖర్ రాయల్, రాజా మల్లికార్జున రాయల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. జాతరకు ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు శ్రీ సుగుటూరు గంగమ్మ సేవా సంఘం సభ్యులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీ వారాహి టీం పుంగనూరు ఆధ్వర్యంలో అమ్మవారి స్టిక్కర్లు పోస్టర్లు కీచైన్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ వారాహి టీం సభ్యులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా జాతర సమయంలో భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీ వారాహి టీం సభ్యులు తెలిపారు. అమ్మవారి మహిమను విస్తృతంగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది ప్రచార సామగ్రిని విడుదల చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జాతర విజయవంతం కావడానికి శ్రీ సుగుటూరు గంగమ్మ సేవా సంఘం సభ్యులు సమిష్టిగా కృషి చేస్తున్నారని వారు తెలిపారు.

# గంగమ్మ జాతరకు ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాల మళ్లింపు



**పుంగనూరు,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ఈనెల 10, 11వ తేదీల్లో జరగనున్న సుగుటూరు గంగమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని సిఐ సుబ్బరాయుడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలను ఈనెల 10వ తేదీ ఉదయం 7 గంటల నుండి 12వ తేది ఉదయం వరకు పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని ఒక ప్రకటనలు తెలిపారు .చిత్తూరు, పలమనేరు వైపు నుండి వచ్చు బారీ వాహనాలు (లారీలు, ట్రక్కులు మొదలైనవి) అన్ని పుంగనూరు పట్టణం లోనికి రాకుండా కనుములో గంగమ్మ గుడి జంక్షన్ నుండి బైపాస్ రోడ్డు ద్వారా భీమగాని పల్లి జంక్షన్ మీదుగా మళ్లించడం జరుగుతుందని, పలమనేరు వైపు నుండి వచ్చు ఆర్టిసి బస్సులు వాసవి కల్యాణమండపం దగ్గర నుండి న్యూ జె టౌన్ వైపు మళ్లించి అక్కడి నుండి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ మీదుగా పుంగనూరు టౌన్ లోకి అనుమతించబడతాయన్నారు. మదనపల్లి వైపు నుండి పలమనేరు, చిత్తూరు వైపు వెళ్ళు ఆర్‌టిసి బస్‌లు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ నుండి గోకుల్ సర్కిల్ మీదుగా మార్కెట్ యార్డ్ మీదుగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ మీదుగా వెళ్తాయని, ముల్బాగల్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు మాధాన పల్లి మీదుగా పిచ్చిగుండ్ల పల్లి, గూడురు పల్లి దగ్గర పలమనేరు హైవే మీదుగా మళ్ళించడం జరుగుతుందని అన్నారు. ముల్బాగల్ నుండి వచ్చే బస్సులను డాన్ బాస్కో స్కూల్ వరకు అనుమతించడం జరుగుతుందని, చిత్తూరు నుండి వచ్చు ఆర్‌టిసి బస్సులను యుఎన్ఆర్ సర్కిల్ జంక్షన్, గోకుల్ సర్కిల్ మీదుగా మదనపల్లె రోడ్డుకు మళ్ళించడం జరుగుతుందని, మదనపల్లి నుంచి వచ్చు ఆర్‌టిసి బస్సులను ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా యుఎన్ఆర్ సర్కిల్ కు మళ్ళించడం జరుగుతుందని, రామసముద్రం నుండి వచ్చే ప్రైవేట్ బస్సులను శుభారం డిగ్రీ కళాశాల వరకు మళ్ళించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించి శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరను విజయవంతం చేయాలన్నారు.

# మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు!

**- విశ్వం విద్యాసంస్థల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి ప్రశంసలు**



**మదనపల్లె/ కురబలకోట,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఏడాది మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సాధికారత, సమాన హక్కులు మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తుచేసుకుంటూ విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వం విద్యాసంస్థల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలోనూ ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల అభివృద్ధి లేకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. మహిళలకు విద్య,ఆరోగ్యం మరియు భద్రత కల్పించడం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమం నందు ప్రిన్సిపల్ డాక్టర్ డి.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ టి.గౌస్ బాషా, వంద మంది మహిళా ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

## గుత్తికోట ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గుత్తికోట ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గుత్తి ఫోర్ట్ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14, 15వ తేదీలైన శనివారం, ఆదివారంలలో రెండు రోజుల పాటు గుత్తి కోట ఉత్సవాలను నిర్వహించడం జరుగు తుందన్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం ఆయా శాఖల అధికారులు సహకారం అందించాలని, ఆయా శాఖల పరిధిలో వివిధ యాక్టివి టీలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనేలా చూడాలని, ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఎస్డీసిలు రామ్మో హన్, ఆనంద్, మల్లికార్జునుడు, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా టూరిజం అధికారిజయకుమార్ బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి



**కందుకూరు,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉలవపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ ఇన్‌చార్జి ప్రీతి తెలిపారు. ఇటీవల కొత్తగా నియమితులైన సిజేరియన్ వైద్యులు సహా అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది కొరత లేకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద ప్రజలు ఈ సేవలను వినియోగించుకొని ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఐశ్వర్యతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఐ వ్యవస్థలను బలోపేతం చేయాలి

**- సైబర్ చట్టాలను కఠినతరం చేయడం అత్యవసరం**

**- మిట్స్ వర్సిటీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సైబర్ అండ్ ఏఐ సెక్యూరిటీలో డాక్టర్.డి.పాల్ రాజ్**




**మదనపల్లె/ కురబలకోట, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ) విభాగం వారు ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్, మిట్స్ ఐఈఈఈ సహకారంతో రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సైబర్ అండ్ ఏఐ సెక్యూరిటీ కార్యక్రమంను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా చెన్నైలోని ఆర్ఎంకే ఇంజనీరింగ్ అటానమస్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి పాల్‌రాజ్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిధి డాక్టర్. డి.పాల్‌రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్‌లు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్. డి.పాల్‌రాజ్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సైబర్ సెక్యూరిటీ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాముఖ్యత ఎంతైనా ఉందని అన్నారు. కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారిత యంత్రాలు, అల్గోరిథములు, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ మోడళ్ళ ద్వారా సైబర్ దాడులను ముందుగానే గుర్తించి అడ్డుకునే రక్షణ కవచంగా పనిచేస్తాయని అన్నారు. నెట్‌వర్క్‌లలో అనుమానాస్పద, అసాధారణ ప్రవర్తనను గుర్తించడం, డేటా భద్రతను మెరుగుపరచడం, మోసపూరిత లావాదేవీలను నిరోధించడం, మాల్వేర్ దాడులను అడ్డుకోవడంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ముఖ్య పాత్ర పోషిస్తోంది అని చెప్పారు .అయితే ఇదే సాంకేతికతను సైబర్ నేరగాళ్లు కూడా ఆధునిక దాడుల కోసం వినియోగిస్తున్నారని. ఏ.ఐ ఆధారిత ఫిషింగ్ సందేశాలు, డీప్‌ఫేక్ వీడియోలు, ఆటోమేటిక్‌గా మార్పులు చెందే మాల్వేర్, సైబర్ దాడులు భద్రతా వ్యవస్థలకు కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయని తెలిపారు. అందువల్ల (ఏఐ) ఆధారిత రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం, పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు మరియు సైబర్ చట్టాలను మరింత కఠినతరం చేయడం అత్యవసరమని సూచించారు. రాబోయే డిజిటల్ భవిష్యత్తులో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ బాధ్యతాయుత వినియోగం ప్రపంచ సైబర్ భద్రతను నిర్ణయించాల్సి ఉంటుంది అని స్పష్టం చేశారు.అలాగే ఈ కార్యక్రమం ద్వారా యువ పరిశోధకు లకు నూతన ఆలోచనలు, పరిశోధన అవకాశాలు ,సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు పరిశ్రమ నిపుణులు ఒకే వేదికపై కలుసుకుని తమ తాజా పరిశోధనలను పంచుకోవడం, సైబర్ ముప్పుల గురించి అవగాహన పెంచుకోవడం మరియు ఏ.ఐ ఆధారిత భద్రతా పరిష్కారాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు అని అన్నారు. దేశ విదేశాల నుంచి 170 మంది పరిశోధకులు, విద్యార్థులు ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొని తమ పరిశోధన పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. ఈ సదస్సులో భోపాల్ లోని ఎన్ఐటి టిటిఆర్ విద్యా సంస్థ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గణపతి, ఒమన్ దేశం, మస్కట్ లోని యూనివర్సిటీ అఫ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ సైన్సెస్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ గుణశేఖరన్ తంగవేల్ లు వర్చ్యువల్ పద్దతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్-స్కూల్ అఫ్ కంప్యూటింగ్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా, విభాగాధిపతి డాక్టర్ బి.పెర్సిస్ అర్బన, కన్వీనర్ డాక్టర్ కే.పి మణికంధన్, కోఆర్డినేటర్స్ టి నిరంజన్, ఎమ్.ముత్తురాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## జాతీయ నాయకత్వాన్ని అవమానించేలా సోషల్ మీడియాలో ప్రచారం

**- బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్**

**- చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి వినతి**




**మదనపల్లె,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజంలో అశాంతి, జాతీయ నాయకత్వాన్ని అవమానించేలా సోషల్ మీడియాలో అభ్యంతర కరమైన ప్రచారం చేసిన అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సరస్వతి నగర్ నివాసి ఎస్. రిహాన్‌పై సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసిన వీడియో పైన తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ధీరజ్ కునుబిల్లికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి లోకేష్ మట్లాడుతూ ఆ పోస్టులో అంతర్జాతీయ పరిణామాలను ప్రస్తావిస్తూ భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర అవమాన కరమైన, దురుద్దేశ పూరితంగా, ప్రజలను ప్రేరేపించే విధమైన వ్యాఖ్యలు చేయడం జరిగిందన్నారు. ఈ విధమైన తప్పుడు దుష్ప్రచారం సామాజిక ఐక్యతకు భంగం కలిగించడమే కాకుండా ప్రజల్లో అసహనం, గందరగోళం సృష్టించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసి, అసత్య ప్రచారం చేయడం, ప్రజలను ప్రేరేపించేలా, వ్యాఖ్యలు చేయడం శాంతి భద్రతలకు హానికరమని సాయి లోకేష్ అన్నారు. కావున అ సోషల్ మీడియా పోస్టుపై వెంటనే విచారించి, తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్పీని కోరారు. అంతే కాకుండా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సోషల్ మీడియా వేదికలపై విద్వేషాలతో ప్రచారం చేసే వ్యక్తులపై నిఘా పెట్టి చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, బర్నే పల్లి రవి కుమార్, బండి ఆనంద్, కిరణ్, భవానిలు పాల్గొన్నారు.

## భూహక్కుదారులు లేకుండా చేసిన సబ్ డివిజన్ రద్దు పరచాలి

**- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన బాధితులు**




**మదనపల్లె,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె మండలం, బసినికొండ గ్రామ పరిధిలోని సర్వే నెం.1058/4 విస్తీర్ణం 1.99 ఎకరాలలో 0.99 ఎకరాలు బసినికొండ గ్రామ పరిధిలో అప్పటి మండల సర్వేయర్ భూమి యజమానులను సంప్రదించకుండా జిపిఏ హోల్డర్లకు అనుకూలంగా తప్పుడు సబ్ డివిజన్ చేసిన విషయం పైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితురాలు జిల్లా కలెక్టరుకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాధితులు ఎం.శాంతా కుమారి, ఎం.రవీంద్ర, ఎన్.సహదేవ నాయుడు, ఎస్.కృష్ణమూర్తి, శ్రీనివాసులు రెడ్డిలు మాట్లాడుతూ మదనపల్లె మండలం బసినికొండ గ్రామ పరిధిలోని సర్వే నెం.1058/4లో ఏర్పాటు చేసిన లేఅవుట్లో హౌస్ ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులమన్నారు. ఈ సర్వే నెంబర్ మొత్తం విస్తీర్ణం 1.99 ఎకరాలు ఉండగా అందులో 0.99 ఎకరాలు బసినికొండ గ్రామ పరిధిలో ఉన్నదని గుర్తు చేశారు.అయితే ఈ భూమికి సంబంధించి అప్పటి మండల సర్వేయర్ భూమి యజమానులను సంప్రదించకుండా జిపిఏ హోల్డర్లకు అనుకూలంగా సబ్ డివిజన్ నిర్వహించినట్లు ఆరోపించారు. ఎపి సర్వే అండ్ బౌండరీస్ యాక్ట్ 1923 ప్రకారం భూమి యజమానులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో కొలతలు వేయాలని వున్నా వాటిని పాటించకుండా సబ్ డివిజన్ చేయడంతో లేఅవుట్లలో ప్లాటు కొనుగోలు చేసిన మాకు భవిష్యత్తులో హక్కుల విషయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున సర్వే నెం.1058/4కు సంబంధించి సబ్ డివిజన్‌పై సమగ్ర విచారణ జరపాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేసిన అప్పటి మండల సర్వేయరుపై చర్యలు తీసుకోవాలని కోరారు. భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని, లేఅవుట్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి హక్కుల రక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## వికసిత్ భారత్ -జి-రాం-జీ పథకంపై గోడపత్రికను ఆవిష్కరణ

**ఏప్రిల్ 2026 నుండి 125 రోజుల పని దినాల కల్పన**

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**మదనపల్లె, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**వికసిత్ భారత్ జి రామ్ జి పతకంపై 125 రోజుల ఉపాధి హామీ గోడపత్రికను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం ఉదయం పిజిఆర్ఎస్ హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్భారత్ జి రామ్ జి పథక అమలుతో గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయాన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2026 ఏప్రిల్ 1 నుంచి విబిజి రామ్ జి అమలు చేస్తుందన్నారు. ప్రస్తుతం జరుతున్న ఉపాధి పనులను ఇంకా పారదర్శకంగా నిర్వహించడం తో పాటు ఉపాధి వేతనదారులకు 125 రోజులు పని కల్పించడం జరుతుందని, రైతులకు వ్యవసాయ పనుల సమయం లో కూలీల కొరత లేకుండా ఉండేందుకు గాను 60 రోజులు ఉపాధి విరామం ప్రకటించడం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో సుస్థిర అభివృద్ధి కి అవసరం అయిన రోడ్లు, కాల్వలు పనులను, రైతులకు ఉపయోగపడే భూమి అభివృద్ధి పనులు, పండ్ల తోటల పనులు ఈ కార్యక్రమం ద్వారా అమలు జరుగుతాయని తెలిపారు. ఈ పథకానికి గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని అందుకు గాను మార్చి నెల అఖరు వరకు గ్రామాలలో ప్రచార కార్యక్రమాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## రజకుల సమస్యలను పరిష్కరించడంలో ప్రాధాన్యత ఇవ్వాలి

**- ఎమ్మెల్యేకు వినతి**



**మదనపల్లె,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రజకుల సమస్యలను పరిష్కరించడంలో మరింత ప్రధాన్యత ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర రజక సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు, మదనపల్లి నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు ముసలికుంట నాగయ్యతో కలసి రజక సంఘం నాయకులు ముది మడుగు రామ్మూర్తి, కలిచర్ల రామ్మూర్తి, సారధిలు ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. సోమవారం మదనపల్లె టమోటో మార్కెట్ యార్డ్ నందు జరిగిన 15 కిలోల క్రెట్స్ పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరుకాగా ఆయన ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అలాగే రజలకు జీవనో పాదికి సంబందించిన దోభి ఘట్స్ మంజూరు చేయడం లోను, వాటి నిర్మాణం లోను తీవ్ర జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఇందులో భాగంగా బికే పల్లి, అమ్మ చెరువుతో పాటు, పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో వున్న దోబి ఘాట్స్ నిర్మాణంలో పనులు త్వరగా ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రజకుల కుల వృత్తిని కొనసాగిస్తూ, జీవనం సాగించడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న దోభి ఘాట్స్‌లో సమస్యలను పరిష్కరించి, మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు వర్క్ షెడ్స్‌ను మంజూరు చేయడంతో పాటు అదనంగా మరి కొన్ని దోబీ ఘాట్లు మంజూరు చేసి వాటి త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చిన్నక్రెట్ల విధానం టమోటో రైతులకు లాభదాయకం

**- ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఏఎంసీ చైర్మన్ జంగాల శివరాం వెల్లడి**



**మదనపల్లె,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిన్న క్రెట్ల విధానం టమోటా రైతులకు లాభదాయకమని, అన్నదాతల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మదనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం రాయల్ పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో 15 కేజీల క్రెట్ల వేలం విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ యార్డుగా ప్రసిద్ధిగాంచిన నీరుగట్టువారిపల్లెకి ప్రతి రోజు వందల టన్నుల్లో టమోటోలు వస్తుంటాయన్నారు. ముఖ్యంగా ఏప్రిల్ మాసం నుండి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధిక మొత్తంలో టమోటాలను రైతులు తీసుకొస్తుంటారని, రైతుల సౌలభ్యం కొరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్నక్రెట్ల విధానానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.ఈ విధానం అటు వ్యాపారులు, ఇటు రైతులకు మేలు చేకూరుస్తుందని వారు వెల్లడించారు. త్వరలోనే మార్కెట్ యార్డ్ నందు రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ రామిశెట్టి ఆంజనేయులు, చేనేత విభాగం రాష్ట్ర నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, టిడిపి సీనియర్ నాయకులు నవీన్ చౌదరి,ముసలికుంట నాగయ్య, డబ్బిగాళ్ల భాస్కర్, ఏఎంసీ డైరెక్టర్లు చల్లా నరసింహులు, ఇడగొట్టి రెడ్డిశేఖర్, మండీ యజమానులు, రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తలపులలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ సేవలు



**పీలేరు, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**ఆరోగ్య పరిక్షలతోనే తల్లిబిడ్డ క్షేమమని అందుకు గర్భిణీలు సూచించిన ఆరోగ్య నియమాలు తప్పనిసరి ఆచరించాలని తలుపుల పి.హెచ్.సి ప్రధాన వైద్యాధికారులు డా.శ్రీగిరీష గర్భిణీలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పిహెచ్‌సి తలపులలో గర్భిణీలకు డా.గిరీష ఆరోగ్య పరీక్షలు చేసి మందులు, సూచనలు తెలియజేశారు. రక్తం, మూత్రం పరీక్షల సహకారంతో హిమోగ్లోబిన్(హెచ్ బి)ఆల్బిమిన్, అధిక రక్తపోటు, మధుమేహం మొదలగు ఆరోగ్య సమస్యల్ని నిర్ధారించి, అవసరమగు సూచనలిస్తూ మాంసకృత్తులు, తాజా ఆకు, కాయగూరలతో పాటు కాల్షియమ్, విటమిన్లు, కొవ్వు పదార్థాలు లభ్యమయ్యే అదనపు పోషకాలు తీసుకోవాలన్నారు. కడుపునొప్పి, ఆయాసం, నీరసం, కాళ్ల వాపు, జ్వరం మొదలు లక్షణాల ఉన్నట్లయితే అతి ప్రమాధికారిగా భావించి నిర్లక్ష్యం వహించకుండా తక్షణం దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత చికిత్స, సలహాలకై సందర్శించాలని తెలిపారు. డా.లక్ష్మీప్రసన్న సహాయ సహకారాలతో ఆరోగ్యపరిక్షల కోసం హాజరైన 26 మంది గర్భిణీలకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, ఏయన్‌యం పాముస్నీసా, నాగవేణి, ప్రమీల, సిహెచ్ఓ కుముదా, ఆశా కార్యకర్తలు గర్భిణీలు పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా.. సమస్యలకు చెక్



**మదనపల్లె,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల సమస్యలను పరిష్కరించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి స్పష్టం చేశారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూ వివాదాలు, సైబర్ నేరాలు, మహిళల వేధింపులపై అందిన ఫిర్యాదులను పరిశీలించి, వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోలీసులు బాధ్యతగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దృష్టికి టమోటా రైతుల సమస్యలు

**- సమస్యలను పరిష్కరించాలని బిజెపి నేతల వినతి**



**మదనపల్లె,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో టొమోటో రైతుల సమస్యలను అన్నమయ్య జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో మదనపల్లె, పరిసర ప్రాంతాల్లో టొమోటో పంట సాగు చేస్తున్న రైతులు చాలా మంది ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం టొమోటో సాగు కోసం ఉపయోగించే మల్చింగ్ పేపర్ కొంత మంది డీలర్లు అనధికారంగా అధిక ధరలకు అమ్ము తున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్కువ ధరకు లభించాల్సిన ఈ కవర్లను ఎక్కువ ధరలకు అమ్మడం వల్ల రైతులపై తీవ్ర మైన ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇందులో ఒక యూనిట్ ధర రూ.2200 ఉంటే దానికి రేటు పెంచి రూ.3200 వరకు అమ్ము తున్నారని తెలిపారు. దీనివల్ల రైతుకు ఒక ఎకరాకు సుమారు రూ.6 వేలు అధిక భారం పడుతున్నదని ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పంటలను సాగుచేసి, మార్కెట్‌కు పంపడం కూడా కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకు వెళ్లి వాటిని పరిష్కరించవలసిందిగా కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లి ప్రశాంత్, పులి నరేంద్ర కుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల కృష్ణమూర్తి, గోపాల్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బర్నేపల్లి రవికుమార్, డాక్టర్ జి అజ్మతుల్లా ఖాన్, పూల నాగరాజు, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు నాయక్, నాగరాజు, పట్టణ అధ్యక్షులు మట్టం కిరణ్, యువ నాయకులు కోసూరి భవానిలు పాల్గొన్నారు.

## మహిళలే మహారాణులు

**ఎంఈఓ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు**



**పీలేరు,మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళలు సమాజంలో మహారాణుల వంటివారని, స్త్రీలు సర్వదా పూజింపబడే వారని మండల విద్యాశాఖ అధికారి వై.లోకేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని పీలేరు మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహించగా, మండల విద్యాశాఖ అధికారులు వై.లోకేశ్వర్ రెడ్డి, బి.పద్మావతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై.లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పురుషుడి విజయానికి వెనుక ఒక స్త్రీ ఉంటుందని అన్నారు. నేటి సమాజంలో అన్ని రంగాలలో మహిళలు చక్కగా రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారని, స్త్రీ శక్తి అపారమని పేర్కొన్నారు. మహిళలను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మండల విద్యాశాఖ అధికారిణి బి.పద్మావతి మాట్లాడుతూ “ఎక్కడ స్త్రీ పూజింపబడుతుందో అక్కడ దేవతలు నివసిస్తారు” అన్నది పెద్దల నానుడని చెప్పారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, స్త్రీ సంకల్పిస్తే సాధించలేనిది ఏదీ లేదని ఆమె అన్నారు. కార్యక్రమం అనంతరం మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు కలిసి మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు శివారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అక్రమ భాష, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మహిళా ఉపాధ్యాయులు, సిఆర్పీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వీరయ్య స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

-ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



**దక్కిలి, మార్చి 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దక్కిలి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నడింపల్లి వీరయ్య స్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నడింపల్లి వీరయ్య స్వామి ఆరాధన మహో త్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రముఖ దేవాలయాలైన స్తంభాగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయం, కొలితోట చెంచమ్మతల్లి ఆలయం, వెలుగొండల యోగలక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ నెల 16న నిర్వహించనున్న నడింపల్లి వీరయ్య స్వామి ఆరాధన మహోత్సవానికి భక్తులు మెచ్చే విధంగా ఘనంగా నిర్వహించాలని గ్రామస్తులకు సూచించారు. మహోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంక్షభంతో తగ్గుతున్న పసిడి ధరలు

- బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల



**న్యూఢిల్లీ,మార్చి9(ఆర్ఎన్ఎ):** గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అస్థిరతి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

## వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

- ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు

**హైదరాబాద్,మార్చి9(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్నగర్లో రహస్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలాపాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో-4 మెథైల్ ప్రొపియోఫినోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో-1 ఫెనైల్-1 ప్రొపనోన్ అనే కెమికల్స్ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్లు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్నగర్లో అద్దె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్ను తిరిగి రాజస్థాన్కు తరలించి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్కు రాజస్థాన్కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్లో మనీష్ బిష్ణోయ్, మనోజ్ మాథూర్, శివపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్నగర్లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు.

## దిగ్గజాలకు ప్రపంచ కప్ విజయాన్ని అంకితం చేసిన గంభీర్



**న్యూఢిల్లీ, మార్చి 9:** టీ20 వరల్డ్కప్ గెలిచిన తర్వాత భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీమ్ ఇండియా వరల్డ్ కప్? విజయాన్ని ఇద్దరు క్రికెట్ దిగ్గజాలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్, బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ చేసిన సేవలే ఆ విజయానికి పునాది అని గంభీర్ పేర్కొన్నారు. గతంలో ఎదురైన విమర్శల మధ్య కూడా తనకు మద్దతుగా నిలిచిన వారికి ట్రోఫీని అంకితం చేస్తున్నానని తెలిపారు. అహ్మదాబాద్లో జరిగిన ఫైనల్లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్?ను 96 పరుగుల తేడాతో ఓడించింది. ఈ విజయంతో భారత్ మూడు సార్లు టీ20 వరల్డ్కప్ గెలిచిన తొలి జట్టుగా నిలిచింది. 2007, 2024 తర్వాత 2026లో మరోసారి ట్రోఫీని దక్కించుకుని టైటిల్ను నిలబెట్టుకున్న తొలి జట్టుగానూ చరిత్ర సృష్టించింది. అదనంగా స్వదేశంలో టైటిల్ను కాపాడుకున్న తొలి జట్టుగా కూడా నిలిచింది. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో గంభీర్ తనపై వచ్చిన విమర్శలకు పరోక్షంగా స్పందించారు. సోషల్ మీడియాలో విమర్శలు చేసే వారికి తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. “సోషల్ మీడియాలో ఉన్నవాళ్లకు నేను బాధ్యత వహించను. డ్రెస్సింగ్ రూమ్లో ఉన్న ఆ 30 మంది ఆటగాళ్లకు మాత్రమే నేను జవాబుదారిని. కోచ్ ఎంత మంచి వాడైనా జట్టు బాగుంటేనే అతడు మంచి కోచ్గా కనిపిస్తాడు. ఈ ఆటగాళ్లే నన్ను కోచ్గా నిలబెట్టారు” అని గంభీర్ తెలిపారు.అయితే ఈ విజయ సమయంలో కూడా తనకు ముందు పనిచేసిన కోచ్లను మర్చిపోలేనని గంభీర్ చెప్పారు. భారత జట్టును బలమైన స్థాయికి తీసుకువచ్చినందుకు ద్రవిడ్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే యువ ప్రతిభను తయారు చేసే వ్యవస్థను బలపరిచినందుకు లక్ష్మణ్ను కూడా అభినందించారు. “ఈ ట్రోఫీని నేను రాహుల్ భాయ్, లక్ష్మణ్?కు అంకితం చేస్తున్నాను. భారత జట్టును బలమైన స్థితిలో ఉంచింది రాహుల్ భాయ్ పని. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా యువ ఆటగాళ్లకు మంచి మార్గం చూపింది లక్ష్మణ్ వ్యవస్థ” అని గంభీర్ చెప్పారు. తన కెరీర్లో క్లిష్ట సమయంలో మద్దతు ఇచ్చిన వారిని కూడా ఆయన గుర్తుచేశారు. ముఖ్యంగా భారత జట్టు టెస్ట్ సిరీస్లలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా చేతిలో ఓటములు ఎదురైనప్పుడు తీవ్ర విమర్శలు ఎదురయ్యాయని చెప్పారు. ఆ సమయంలో బీసీసీఐ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నిజాయితీగా పనిచేశారని కొనియాడారు. అలాగే ఐసీసీ చైర్మన్ జై షా కూడా తనకు ఫోన్ చేసి ధైర్యం చెప్పారని వెల్లడించారు. ఈ విజయానికి ప్రధాన కారణం జట్టు దూకుడు అని గంభీర్ అన్నారు. ఓటమి భయం లేకుండా ఆడటమే తమ వ్యూహమని వివరించారు. “ఓటమి భయాన్ని వదిలేయాలి. కేవలం రక్షణాత్మకంగా ఆడటం కంటే ధైర్యంగా ఆడాలి. 120 పరుగులకు ఆలౌట్ అయినా పర్వాలేదు. కానీ సెమీఫైనల్, ఫైనల్ వంటి పెద్ద మ్యాచ్లలో 250 పరుగులు చేసే ధైర్యం ఉండాలి” అని గంభీర్ పేర్కొన్నారు. జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వాన్ని కూడా గంభీర్ ప్రశంసించారు. అతను కోచ్ పనిని సులభం చేశాడని చెప్పారు. వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు విజయమే ముఖ్యమని మరోసారి స్పష్టం చేశారు. “సూర్య నా పని చాలా సులభం చేశాడు. అతను ఒక నాయకుడే కాదు, జట్టుకు తండ్రిలాంటి వ్యక్తి. చాలా సంవత్సరాలుగా మనం వ్యక్తిగత మైలురాళ్లను ఎక్కువగా సెలబ్రేట్ చేశాం. కానీ అసలు లక్ష్యం ట్రోఫీలను గెలవడం కావాలి” అని గంభీర్ చెప్పారు. ఇక ఫైనల్ మ్యాచ్?లో భారత జట్టు బ్యాటింగ్లో దూకుడుగా ఆడింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ సంజూ శాంసన్ 89 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, అభిషేక్ శర్మ 52 పరుగులు, ఇషాన్ కిషన్ 54 పరుగులతో మెరిశారు. టాప్ ఆర్డర్ దూకుడుగా ఆడటంతో న్యూజిలాండ్ బౌలర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. బౌలింగ్లో భారత్ పూర్తిగా ఆధిపత్యం చూపింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా నాలుగు ఓవర్లలో కేవలం 15 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కుదేలు చేశారు. స్పిన్నర్ అక్షర్ పటేల్? కూడా మూడు వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 159 పరుగులకు ఆలౌట్ అయింది.

## టీమిండియాకు ఐసీసీ భారీ క్యాష్ ప్రైజ్

**న్యూఢిల్లీ, మార్చి 9:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా విజేగా నిలిచింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోర్ చేయగా.. న్యూజిలాండ్ 159 పరుగులకు ఆలౌటైంది. ఈ గెలుపుతో డిఫెండింగ్ ఛాంపియన్గా టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు సొంతగడ్డపై ప్రపంచకప్ గెలిచిన టీమ్గా సరికొత్త చరిత్ర సృష్టించింది. టీమిండియాకు ఇది మూడో టీ20 ప్రపంచకప్ కావడం విశేషం. విశ్వవిజేతగా నిలిచిన టీమిండియాకు ఐసీసీ భారీ క్యాష్ ప్రైజ్ అందజేయనుంది. ఈ టోర్నీ కోసం ఐసీసీ మొత్తం 13.5 మిలియన్ డాలర్ల(రూ.120 కోట్ల) ప్రైజ్మనీ ప్రకటించింది. ఈ ప్రైజ్మనీని టోర్నీలో పాల్గొన్న జట్ల స్థానాల ఆధారంగా పంపిణీ చేయనున్నారు. ఛాంపియన్గా నిలిచిన భారత జట్టుకు ప్రైజ్మనీగా 3 మిలియన్ డాలర్లు(రూ.27.48 కోట్లు) దక్కనుంది. ఫైనల్లో రన్నరప్గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు 1.6( రూ.14.65 కోట్లు) మిలియన్ డాలర్లు దక్కనుండగా.. సెమీ ఫైనల్లో ఓడిన జట్లకు 7,90,000 డాలర్ల(రూ.7.24 కోట్లు) ప్రైజ్మనీ లభించనుంది. సూపర్-8 చేరిన జట్లకు 380,000(రూ.3.48 కోట్లు) డాటర్లు, గ్రూప్ స్టేజ్లో జట్లకు 250,000(రూ.2.29 కోట్లు) ప్రైజ్మనీ దక్కనుంది. ఈ ప్రైజ్మనీ మొత్తం ఆటగాళ్లకు కాకుండా ఆయా దేశాల క్రికెట్ బోర్డుకు ఐసీసీ అందజేయనుంది. అయితే బీసీసీఐ ఈ ప్రైజ్మనీతో కలిపి విజేతగా నిలిచిన భారత జట్టుకు భారీ నజరానా ప్రకటించే అవకాశం ఉంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ ఏకంగా రూ. 125 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్ను ప్రకటించింది. ఇందులో ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.5 కోట్లు ఇవ్వగా.. రిజర్వ్ ప్లేయర్స్కు రూ. కోటి నజరానా అందజేశారు. సపోర్ట్ స్టాఫ్ కూడా సమానంగా ప్రైజ్మనీ ఇచ్చారు. ఈసారి కూడా అదే రీతిలో బీసీసీఐ భారీ నజరానా ప్రకటించే అవకాశం ఉంది.

## గంభీర్ నవ్వుపై చమత్కరిస్తూ ధోనీ అభినందన

**న్యూఢిల్లీ, మార్చి 9:** భారత క్రికెట్ అభిమానులకు ఇది డబుల్ ధమాకా. ఆదివారం జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ను చిత్తు చేసి టీమిండియా విశ్వవిజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చారిత్రాత్మక గెలుపు ఒక ఎత్తైతే.. టీమిండియా ఇద్దరు దిగ్గజాలు, మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మధ్య జరిగిన ఒక ఆసక్తికరమైన సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. వీరిద్దరి మధ్య పడదని, మనస్పర్థలు ఉన్నాయని గత కొన్నేళ్లుగా వస్తున్న వార్తలకు ఈ ఒక్క ఇన్స్టాగ్రామ్ పోస్ట్ చెక్ పెట్టింది. భారత్ వరల్డ్ కప్ గెలవగానే ఎంఎస్ ధోనీ తన ఇన్స్టాగ్రామ్ వేదికగా టీమిండియాకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పోస్ట్ పెట్టాడు. అందులో ధోనీ టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గురించి చాలా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. నేరుగా పేరు చెప్పనప్పటికీ.. “కోచ్ సాబ్.. మీ ముఖం మీద నవ్వు చాలా బాగుంది. ఆ చిరునవ్వుతో కూడిన గాంభీర్యం కలయిక అద్భుతం!” అంటూ ధోనీ చమత్కరించాడు. గంభీర్ సాధారణంగా సీరియస్గా ఉంటాడనే విషయాన్ని ధోనీ తనదైన శైలిలో గుర్తు చేస్తూ అభినందించడం అభిమానులను ఖుషీ చేసింది. ధోనీ పెట్టిన ఈ పోస్ట్కు గౌతమ్ గంభీర్ వెంటనే స్పందించాడు. “నవ్వడానికి ఇంతకంటే మంచి కారణం ఏముంటుంది? మిమ్మల్ని చూడటం చాలా ఆనందంగా ఉంది!” అంటూ గంభీర్ రిప్లై ఇచ్చాడు. గంభీర్ చేసిన ఈ కామెంట్ కేవలం 3 గంటల్లోనే 60 వేలకు పైగా లైకులను సొంతం చేసుకుంది. వీరిద్దరి మధ్య ఉన్న ఈ స్వీట్ మూమెంట్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. “మేము చూడాల్సింది ఇదే.. వరల్డ్ కప్ గెలుపు మాకు ఈ అద్భుతమైన క్షణాన్ని బహుమతిగా ఇచ్చింది” అంటూ నెటిజన్లు కామెంట్లతో ముంచెత్తుతున్నారు. భారత జట్టు హెడ్ కోచ్గా గౌతమ్ గంభీర్ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోంది. వైట్ బాల్ క్రికెట్లో గంభీర్ కోచింగ్ టీమిండియాకు బాగా అ కలిసి వచ్చింది. గంభీర్ సారథ్యంలో భారత్ ఇప్పటికే 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఇప్పుడు తాజాగా 2026 టీ20 వరల్డ్ కప్ టైటిల్ను కూడా కైవసం చేసుకుని గంభీర్ తన కోచింగ్ పవర్ను నిరూపించుకున్నాడు.

## విషాదాన్ని అధిగమించి.. ఇషాన్ కిషన్ కీలక ఇన్నింగ్స్



**న్యూఢిల్లీ, మార్చి 9:** ఒకానొక సమయంలో ఇండియా నేషనల్ టీంకు దూరమైన ఇషాన్ కిషన్, తన కష్టంతో తల రాతను మార్చుకున్నాడు. డొమెస్టిక్ క్రికెట్లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత అతనికి జాతీయ జట్టులో చోటు దక్కింది. ఇప్పుడు అతను పొట్టి ప్రపంచ కప్ విజేతగా నిలిచిన జట్టులో సభ్యుడు. న్యూజిలాండ్తో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఇషాన్ 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో హాఫ్ సెంచరీ (54 పరుగుల) ఇన్నింగ్స్ ఆడాడు. ఫైనల్ మ్యాచ్కు కేవలం ర2 రోజుల ముందే ఇషాన్ కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. మీడియా నివేదికల ప్రకారం, ఫైనల్కు రెండు రోజుల ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇషాన్ కిషన్ సోదరి (కజిన్), బావ మతిచెందారు. కుటుంబంలో ఇంతటి భారీ విషాదం నెలకొన్నప్పటికీ, ఇషాన్ కిషన్ దేశానికే ప్రియారిటీ ఇస్తూ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. తాను ఇంతటి బాధలో ఉన్నాననే విషయాన్ని అస్సలు తెలియనివ్వలేదు. ఇటీవల రింకూ సింగ్ తండ్రి కన్నుమూశారు. అక్కడ కార్యక్రమం నిర్వహించిన వెంటనే రింకూ వెంటనే జాతీయ జట్టు కోసం తిరిగి వచ్చి దేశానికి తొలి ప్రాధాన్యం ఇచ్చాడు.ఇషాన్ కిషన్ తండ్రి ప్రణవ్ పాండే మాట్లాడు తూ.. “మేం చాలా కష్టంలో ఉన్నాం. ఇషాన్కు కూడా ఇంటివి రావాలి అనిపించింది. కానీ ప్రపంచ కప్లో జాతీయ జట్టుకు ఆడాల్సి ఉన్న కారణంగా రాలేకపోయాడు. అతను తన బాధను దిగమింగుతూ జట్టు కోసం మంచి ఇన్నింగ్స్ ఆడాడు’ అని తెలిపారు. ఈ విషాదం కారణంగానే ఇషాన్ కిషన్ తండ్రి ఫైనల్ మ్యాచ్ను చూసేందుకు అహ్మదాబాద్ రాలేదు. టీ20 ప్రపంచకప్లో ఇషాన్ బ్యాట్ ఝుళిపించి సత్తా చాటాడు. టోర్నమెంట్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో అతను 4వ స్థానంలో నిలిచాడు. ఇషాన్ 9 మ్యాచ్ల్లోని 9 ఇన్నింగ్స్ల్లో 35.22 సగటుతో, 193.29 మెరుపు స్ట్రైక్ రేట్తో 317 పరుగులు సాధించాడు. టోర్నీలో ఇషాన్ కిషన్ 3 అర్ధ శతకాలు చేశాడు. షాన్ ఇప్పటివరకు తన టీ20 అంతర్జాతీయ కెరీర్లో 45 మ్యాచ్లు ఆడాడు. ఈ మ్యాచ్ల్లోని 45 ఇన్నింగ్స్ల్లో బ్యాటింగ్ చేస్తూ 1328 పరుగులు చేశాడు. అతడు ఒక్క సెంచరీ, 10 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్లు సంజూ శాంసన్ (89), అభిషేక్ శర్మ (52) తో పాటు వన్ డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీలతో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది.



## క్రీడలు

## గంభీర్ అన్స్టాపబుల్..



**న్యూఢిల్లీ, మార్చి 9:** భారత క్రికెట్లో గౌతమ్ గంభీర్ పేరు మరోసారి మార్మోగిపోతోంది. టీమ్ఇండియా ప్రధాన కోచ్గా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే అతను అద్భుతాలు సృష్టిస్తున్నాడు. అయితే మధ్యమధ్యలో తనపై అనేక విమర్శలు వచ్చినా అవేమి పట్టించుకోకుండా ముందుకు సాగాడు. తాజాగా అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్తో జరిగిన ఫైనల్లో భారత్ ఘనవిజయం సాధించడంతో గంభీర్ ఖాతాలో ఒక అరుదైన ప్రపంచ రికార్డు చేరింది. రెండు విధాలుగా టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి క్రికెటర్గా అతడు అరుదైన ఘనత సాధించాడు. గౌతమ్ గంభీర్ ప్రయాణం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2007లో జరిగిన మొట్టమొదటి టీ20 వరల్డ్ కప్ ఫైనల్ నెగ్గిన భారత జట్టులో అతడు సభ్యుడు. ఆ టోర్నీలో ప్లేయర్గా అద్భుత ఇన్నింగ్స్ ఆడి భారత్కు కప్పు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. సరిగ్గా 19 ఏళ్ల తర్వాత, 2026లో అదే టోర్నీలో మళ్లీ టీ20 వరల్డ్కప్ను అందుకున్నాడు. అయితే ఈసారి కోచ్గా ఆ ఘనత సాధించాడు. జట్టుకు కోచ్గా ఉంటు తన వ్యూహాలతో టీమ్ఇండియాను విజేత నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇలా రెండు విభిన్న పాత్రల్లో ప్రపంచ ఛాంపియన్గా నిలవడం క్రికెట్లో ఇదే తొలిసారి. దీనికి తోడు 2011 వన్డే వరల్డ్ కప్ విజేత జట్టులో కూడా గంభీర్ సభ్యుడిగా కీలకపాత్ర పోషించాడు. భారత సీనియర్ పురుషుల జట్టు కోచ్లలో ఇంతవరకు ఎవరికీ సాధ్యం కాని రికార్డును గంభీర్ అందుకున్నాడు. కేవలం రెండేళ్లలోపే రెండు ఐసీసీ ట్రోఫీలు (2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 వరల్డ్ కప్) గెలిపించిన ఏకైక కోచ్గా నిలిచాడు. గతేడాది దుబాయ్లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో కివీస్ను 4 వికెట్ల తేడాతో ఓడించిన భారత్, ఇప్పుడు అహ్మదాబాద్లో అదే కివీస్ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసి వరుస విజయాలను అందుకుంది. ఈ రెండు భారీ విజయాల వెనుక గంభీర్ మాస్టర్ మైండ్ ఉందనడంలో సందేహం లేదు. గౌతమ్ గంభీర్ తన దూకుడు స్వభావంతో జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాడు. సీనియర్లు, జూనియర్ల మధ్య సమన్వయం కుదురుస్తూ తీసుకున్న నిర్ణయాలు నేడు భారత్కు మరో కప్పు తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా సంజు శాంసన్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లపై ఉంచిన నమ్మకం ఫైనల్ మ్యాచ్లో సరైన ఫలితాన్ని ఇచ్చింది. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన గంభీర్, భవిష్యత్తులో మరిన్ని విజయాలను టీమ్ఇండియాకు అందిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. కోచ్గా గంభీర్ ప్రయాణం అంత సాఫీగా ఏమీ సాగలేదు. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్లో టీమ్ఇండియా వరుసగా ఎదుర్కొన్న కొన్ని వైఫల్యాలు విమర్శల వర్షం కురిపించాయి. సంప్రదాయ క్రికెట్లో కూడా అగ్రెసివ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని గంభీర్ చేసిన ప్రయోగాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో, కోచింగ్ శైలిపై నెగిటివ్ కామెంట్స్ గట్టిగానే వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లను పక్కన పెట్టి కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు, అది జట్టు బలాన్ని దెబ్బతీస్తోందనే వాదనలు కూడా గట్టిగా వినిపించాయి. ఆ సమయంలో గంభీర్ వ్యూహాలు కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్కే పరిమితమా అనే ప్రశ్నలు తలెత్తినా, అతను మాత్రం తన పంథాను మార్చుకోకుండా జట్టును ముందుకు నడిపించాడు. వరుస విమర్శలు ఎదురైనప్పటికీ గంభీర్ తనపై ఉన్న నమ్మకాన్ని వదులుకోలేదు. టెస్టుల్లో ఎదురైన ఆ ఒడుదొడుకుల నుంచే పాఠాలు నేర్చుకుని, వైట్ బాల్ క్రికెట్లో టీమ్ఇండియాను ఛాంపియన్? జట్టుగా నడిపిస్తున్నాడు. విమర్శలు వచ్చిన ప్రతిసారీ తనదైన శైలిలో సమాధానమిచ్చే గంభీర్, ఇప్పుడు ఏకకాలంలో రెండు ఐసీసీ ట్రోఫీలు అందించి అందరి నోళ్లు మూయించాడు. విమర్శలను విజయాలుగా మార్చుకోవడంలో ఆయనకు ఆయనే సాటి అని ఈ గెలుపుతో మరోసారి నిరూపించాడు. ప్రయోగాలు విఫలమైనా వెనకడుగు వేయకుండా, ఫైనల్గా జట్టును ప్రపంచ విజేతగా నిలబెట్టిన గంభీర్ అసలైన ‘మాస్టర్ మైండ్’ అని క్రికెట్ పండితులు ఇప్పుడు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## టీమ్ఇండియా రికార్డుల సునామీ



**న్యూఢిల్లీ, మార్చి 9:** అహ్మదాబాద్లోని నరేంద్ర మోదీ స్టేడియంలో బ్యాడ్ సెంటిమెంటును బ్రేక్ చేసి టీమ్ఇండియా గర్జించింది. టాస్ ఎవరు గెలిస్తే వారేదే విజయం అనే మాటకు అసలైన జవాబు ఇచ్చింది. అయితే కేవలం టైటిల్ గెలవడమే కాదు, క్రికెట్ చరిత్రలో మున్నెన్నడూ లేని విధంగా రికార్డుల సునామీని సృష్టించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు కివీస్ను 96 పరుగుల తేడాతో మట్టికరిపించి, తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ గెలుపుతో భారత్ కేవలం ఛాంపియన్గా నిలవడమే కాకుండా, గణాంకాల పరంగా ప్రపంచ క్రికెట్ను శాసించే స్థాయికి చేరుకుంది. ఒకే మ్యాచ్లో ఇన్ని రికార్డులు బద్దలవ్వడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్లో తిరుగులేని బలాన్ని బయటపెట్టిన భారత్, ఈ టోర్నీ ద్వారా సాధించిన ఆ అరుదైన రికార్డులను సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో టీమ్ఇండియా బ్యాటర్లు సిక్సర్లతో విరుచుకుపడ్డారు. మొత్తం టోర్నీలో భారత్ ఏకంగా 106 సిక్సర్లు బాదింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఒకే ఎడిషన్లో ఒక జట్టు ఇన్ని సిక్సర్లు బాదడం ఇదే మొదటిసారి. ఫైనల్ మ్యాచులో కూడా భారత్ దూకుడు ఏమాత్రం తగ్గలేదు. పవర్? ప్లేలోనే వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసి వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక పవర్ ప్లే స్కోరును నమోదు చేసింది. ఈ అద్భుతమైన ఆరంభమే భారత్ భారీ స్కోరు సాధించడానికి బలమైన పునాది వేసింది. బ్యాటింగ్లో భారత్ మెరుపు వేగంతో పరుగులు రాబట్టింది. కేవలం 4 ఓవర్లలోనే జట్టు యాభై పరుగుల మార్కును చేరుకుని, టీ20 వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచులలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును నెలకొల్పింది. అక్కడితో ఆగకుండా, కేవలం 44 బంతుల్లోనే (7.2 ఓవర్లలో) జట్టు సెంచరీ పూర్తి చేసింది. దీంతో నాకౌట్ మ్యాచులలో వేగవంతమైన వంద పరుగుల రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. ఈ టోర్నీలో భారత్ ఏకంగా మూడుసార్లు 250కి పైగా స్కోర్లు సాధించి, ఒకే ఎడిషన్లో అత్యధిక సార్లు ఈ ఘనత సాధించిన జట్టుగా నిలిచింది. ఈ వరల్డ్ కప్లో సంజు శాంసన్ బ్యాటింగ్లో సరికొత్త రికార్డులను సృష్టించారు. టోర్నీ మొత్తంలో 321 పరుగులు చేసి, ఒకే టీ20 వరల్డ్ కప్ ఎడిషన్లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్గా నిలిచారు. గతంలో విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును సంజు అధిగమించడం విశేషం. ఫైనల్ మ్యాచులో 89 పరుగులు చేసిన సంజు, వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా మార్లన్ శామ్యూల్స్ (85) రికార్డును చెరిపివేశారు. సంజుకు తోడుగా అభిషేక్ శర్మ (52), ఇషాన్ కిషన్ (54) కూడా అర్ధ సెంచరీలతో కివీస్ బౌలర్లను చిత్తు చేశారు. ఫైనల్లో న్యూజిలాండ్పై 96 పరుగుల తేడాతో గెలిచిన భారత్, టీ20 వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలోనే పరుగుల పరంగా అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్, జస్ప్రీత్ బుమ్రా (4 వికెట్లు), అక్షర్ పటేల్ (3 వికెట్లు) ధాటికి 159 పరుగులకే కుప్పకూలింది. భారీ స్కోరు సాధించడమే కాకుండా, బౌలింగ్లో కూడా కివీస్?పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి భారత్ ఏకపక్షంగా ఈ మ్యాచును గెలుచుకుంది. ఒత్తిడిలో కివీస్ బ్యాటర్లు చేతులెత్తేయడం భారత్ కు కలిసి వచ్చింది. భారత జట్టు ఈ విజయంతో తన మూడవ టీ20 ప్రపంచకప్ టైటిల్ను సొంతం చేసుకుంది. ప్రపంచంలో మూడు సార్లు ఈ ఘనత సాధించిన ఏకైక జట్టుగా టీమ్ఇండియా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, 2024లో టైటిల్ గెలిచిన భారత్, ఇప్పుడు మళ్లీ గెలిచి టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే వరుసగా రెండుసార్లు టైటిల్ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా నిలిచింది. గతంలో ఏ జట్టుకూ సాధ్యం కాని ఈ అరుదైన ఫీట్ను సూర్య సేన సాధించి చూపింది. సొంత గడ్డపై ఆడుతూ ప్రపంచకప్ గెలిచిన మొట్టమొదటి ఆతిథ్య దేశంగా కూడా భారత్ ట్రెండ్ సెట్ చేసింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్లు, ఒక ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్ ప్రస్తుతం గోల్డెన్ ఎరాలో కొనసాగుతోంది. అహ్మదాబాద్ వేదికగా పాత గాయాలను చెరిపేస్తూ, సరికొత్త రికార్డులతో ప్రపంచ ఛాంపియన్గా నిలవడం భారత క్రికెట్ కు ఒక చారిత్రాత్మక విజయం. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో యువ రక్తం ఉరకలేస్తున్న టీమ్ఇండియా, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు చేయడానికి సిద్ధంగా ఉందని చెప్పవచ్చు. ఇక 2027లో వరల్డ్ కప్ కూడా అందుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి ఆ టోర్నీకి టీమ్ఇండియా ఎలా సిద్ధమవుతుందో చూడాలి.

